

తెలుగు దినపత్రిక

సాక్షర

చదువు..సమీక్షించు

RNI NO.APTEL/2011/42149



ఆదిలాబాద్ | సంపుటి : 16 సంచిక : 273 గురువారం, నవంబర్ 05, 2026 ఎడిటర్: ఎ. లింగన్న | పేజీలు : 8 రూ. 2.00

ఈ నెల కరెంట్ భారం...



హైదరాబాద్: తెలంగాణలో విద్యుత్ వినియోగదారులకు కీలకమైన సమాచారం అందింది. ఈనెల కరెంట్ బిల్లుల్లో కొత్తగా అదనపు ఛార్జీలు వసూలు చేయడానికి విద్యుత్ డిస్కంలు సిద్ధమయ్యాయి. నవంబర్ నెలలో కరెంట్ బిల్లుల్లో ట్రూ-అప్ ఛార్జీల రూపంలో కొత్త భారం మొదలవుతోందిఈ ఛార్జీలు తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి టీజీఈఆర్‌సీ అనుమతి మేరకు వసూలు చేయబడుతున్నాయి. 2022-23 మరియు 2023-24 ఆర్థిక సంవత్సరాల్లో ఏర్పడిన అదనపు వ్యయాలు, రెవెన్యూ లోటును భర్తీ చేయడానికి ఈ ట్రూ-అప్ ఛార్జీలు అవసరమయ్యాయి. 4 లో

కోమటిరెడ్డికి మంత్రి పదవి దూరమయినట్లేనా?



నల్గొండ: కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవి ఇంకా ఊరిస్తూనే ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తుంది. అయితే ఇప్పటి వరకూ రెండు, మూడు సార్లు మంత్రి వర్గ విస్తరణ జరిగినప్పటికీ కోమటిరెడ్డికి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని మాత్రం కాంగ్రెస్ హైకమాండ్ నెరవేర్చలేదు. దీంతో ఆయనలో ఉన్న అసంతృప్తి అప్పుడప్పుడూ బయటకు వస్తుంది. తాజాగా తన నియోజకవర్గం అభివృద్ధి నిధులు మంజూరు చేయకుండా పక్షపాత వైఖరిని అవలంబిస్తున్నారని మండిపడ్డారు. 2 లో

పోలవరం-బనకచర్ల లింక్‌పై రేవంత్ సర్కార్ ద్వంద్వ వైఖరి



పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నదీ జలాల వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన విధానం లేదని, ఈ విషయం ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశాలతో మరోసారి బహిర్గతమైందని ఆమె విమర్శించారు. ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశాల్లో రాష్ట్ర అధికారులు గోదావరి - కావేరి నదుల అనుసంధానాన్ని సమ్మక్క సాగర్ నుంచి చేపట్టాలని కోరుతుంటే. 2 లో

సోషల్ మీడియాలో కాదు..దమ్ముంటే సభలో చర్చకు రండి:రాహుల్‌కు నిర్మల సవాల్



సాక్షర,ఢిల్లీ: బహిరంగ చర్చకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ సిద్ధమా? అంటూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విసిరిన సవాల్‌పై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. చర్చలకు సరైన వేదిక పార్లమెంట్ అని, సోషల్ మీడియా కాదని తేల్చిచెప్పారు. ఈ మేరకు తన 'ఎక్స్' ఖాతాలో రాహుల్ గాంధీని ఉద్దేశించి ఆమె వరుస పోస్టులు చేశారు. "రాహుల్ జీ, చర్చకు వేదికను ఎంచుకోమని మీరు ప్రధానిని కోరుతున్నారు. దానికి ఇప్పటికే ఒక వేదిక ఉంది, అదే పార్లమెంట్. దానికి మీరే ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నారు" అని నిర్మల పేర్కొన్నారు. ఎలక్టోరల్ రోల్స్ ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్), ఈవీఎంల పనితీరుపై చర్చించేందుకు పార్లమెంటులో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేద్దామని హోంమంత్రి అమిత్ షా సోమవారమే ప్రతిపాదించిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. "సోషల్ మీడియాలో సవాళ్లు విసిరినంత ఉత్సాహం పార్లమెంటులో చర్చకు ఎందుకు చూపించడం లేదు?" అని ఆమె ప్రశ్నించారు. ప్రభుత్వం సమాధానం చెప్పేందుకు ప్రయత్నించిన ప్రతిసారీ కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు సభ నుంచి వాకౌట్ చేస్తున్నారని నిర్మలా సీతారామన్ ఆరోపించారు. మిగతా 2 లో

కలుషిత నదిగా మంజీరా



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో నదుల కాలుష్యంపై రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) విడుదల చేసిన తాజా నివేదిక ఆందోళన కలిగిస్తోంది. ఈ నివేదిక ప్రకారం, మంజీర, మూసి, కృష్ణ, గోదావరి నదులు అత్యంత కాలుష్యానికి గురైనట్లు స్పష్టం చేసింది. ముఖ్యంగా, హైదరాబాద్ నగరానికి నీరు అందించే మంజీర నది తీవ్రంగా కాలుష్యానికి గురైందని పేర్కొంది.2022లో కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) తెలంగాణలో 9 నదీ పరివాహక ప్రాంతాలను కాలుష్య కాసారాలుగా గుర్తించింది. అయితే, ఇటీవల విడుదలైన సవరించిన నివేదికలో నక్కవాగు, కరకవాగు, కిన్నెరసాని, మున్నేరు నదుల పరివాహక ప్రాంతాలను కాలుష్య జాబితా నుంచి తొలగించడం గమనార్హం. మిగిలిన 5 ప్రాంతాల్లో మానేరు నదిలో నీరు అందుబాటులో లేకపోవడం వల్ల నమూనాలను సేకరించలేకపోయామని నివేదికలో పేర్కొంది.నదీ జలాల నాణ్యతను అంచనా వేయడానికి బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (బీవోడీ)ను కీలక ప్రమాణంగా పరిగణిస్తారు. సాధారణంగా, నదీ నీరు సురక్షితంగా ఉండాలంటే బీవోడీ స్థాయి లీటరుకు 3 మిల్లీగ్రాముల కంటే తక్కువగా ఉండాలి. 3 లో

కేసీఆర్‌కు పేరు వస్తుందనే నీళ్లివ్వడం లేదు వేముల ప్రశాంత్ రెడ్డి



తెలంగాణ ప్రభుత్వంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ బాన్సువాడ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్నది కాలం తెచ్చిన కరవు కాదని, ఇది పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిపెట్టిన కరవని ఆయన విమర్శించారు. పలువురు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలతో కూడిన ప్రతినిధి బృందం భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లోని మేడిగడ్డ బ్యారేజీని సందర్శించింది. 3 లో

అమెరికా మధ్యంతర ఎన్నికలు..సత్తా చాటుతున్న భారత సంతతి అభ్యర్థులు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదవీకాలంలోని చివరి రెండేళ్లలో కాంగ్రెస్‌పై ఎవరికి పట్టు ఉంటుందో తేల్చే మధ్యంతర ఎన్నికల పోలింగ్ మంగళవారం ముగిసింది. దేశవ్యాప్తంగా ప్రతినిధుల సభలోని మొత్తం 435 స్థానాలకు, 100 మంది సభ్యులున్న సెనెట్‌లోని 37 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. వీటితో పాటు 36 రాష్ట్రాల్లో గవర్నర్ పదవులకు కూడా ఓటింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో పెద్ద సంఖ్యలో భారత సంతతికి చెందిన అభ్యర్థులు కీలక పదవుల కోసం పోటీ పడుతుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఎన్నికల్లో భారత సంతతికి చెందిన డెమోక్రటిక్ నేత సుహాస్ సుబ్రమణ్యం ఘన విజయం సాధించారు. వర్జీనియాలోని 10వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి పోటీ చేసిన ఆయన, 61 శాతానికి పైగా ఓట్లు సాధించి ప్రతినిధుల సభకు తిరిగి ఎన్నికయ్యారు. ఆయన ప్రత్యర్థి, రిపబ్లికన్ అభ్యర్థి డేవ్ బెక్‌విత్‌కు 36 శాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయి. గతంలో బరాక్ ఒబామా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు వైట్‌హౌస్‌లో టెక్నాలజీ పాలసీ సలహాదారుగా సుహాస్ పనిచేశారు. అందరి దృష్టినీ ఆకర్షిస్తున్న ఒహాయో గవర్నర్ పదవికి రిపబ్లికన్ పార్టీ తరఫున పోటీ పడుతున్న భారత సంతతి వ్యాపారవేత్త వివేక్ రామస్వామి ప్రస్తుతం వెనుకంజలో ఉన్నారు. పూర్తిగా 3 లో

మధ్యంతర ఎన్నికల్లో ట్రంప్‌కు షాక్..

అమెరికాలో జరిగిన మధ్యంతర ఎన్నికల ఫలితాలు తీవ్ర ఉత్కంఠ రేపుతున్నాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదవీకాలంలో 'కాంగ్రెస్'పై పట్టు ఎవరిదో తేల్చే ఈ ఎన్నికల్లో, తొలి ఫలితాలు డెమోక్రాటిక్ పార్టీకి అనుకూలంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రతినిధుల సభలో పలు కీలక స్థానాల్లో డెమోక్రాట్లు ఆధిక్యంలో ఉండటం రిపబ్లికన్ పార్టీలో ఆందోళన రేకెత్తిస్తోంది.నవంబర్ 3న జరిగిన ఈ ఎన్నికల్లో మొత్తం 435 ప్రతినిధుల సభ స్థానాలకు, 35 సెనేట్ స్థానాలకు, 36 గవర్నర్ పదవులకు పోలింగ్ జరిగింది. ఎన్నికలకు ముందు ప్రతినిధుల సభలో రిపబ్లికన్లకు స్వల్ప మెజారిటీ (సుమారు 218-214) ఉండగా, డెమోక్రాట్లు సభలో ఆధిక్యం సాధించాలంటే కేవలం మూడు సీట్లు అదనంగా గెలుచుకోవాల్సి ఉంది. అదేవిధంగా, 53-47 మెజారిటీతో రిపబ్లికన్ల ఆధీనంలో ఉన్న సెనేట్‌ను కైవసం చేసుకోవాలంటే డెమోక్రాట్లకు నాలుగు స్థానాలు అవసరం.ఓట్ల లెక్కింపు ప్రారంభమైన తర్వాత తూర్పు తీర రాష్ట్రాల నుంచి ఫలితాలు వెలువడటం మొదలైంది. జార్జియాలో డెమోక్రాటిక్ సెనేటర్ జాన్ ఓసాఫ్ తిరిగి ఎన్నికైనట్లు ప్రముఖ మీడియా సంస్థలు ప్రకటించాయి. ఇది డెమోక్రాటిక్ పార్టీకి కీలకమైన విజయంగా భావిస్తున్నారు. అంతేకాకుండా, ఫ్లోరిడాలోని కొన్ని రిపబ్లికన్ల ఆధీనంలో ఉన్న ప్రతినిధుల సభ స్థానాల్లో కూడా డెమోక్రాట్లు ఆధిక్యంలో కొనసాగుతుండటం గమనార్హం. పూర్తిగా 2 లో

గవర్నర్ కోటా ఎమ్మెల్సీ సీట్లపై కర్చీఫ్‌లు

సాక్షర,హైదరాబాద్: తెలంగాణలో మళ్లీ ఎన్నికల సందడి ప్రారంభమైంది. ఈ సారి గవర్నర్ కోటాలో ఉన్న మూడు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవుతున్నాయి. దీంతో మాకంటే మాకే అంటూ.. చాలా మంది నాయకులు క్యూ కట్టారు. అయితే.. రెండు రకాలుగా ఈ విషయంపై పార్టీ నేతలు దృష్టి పెట్టారు. 1) పార్టీ కోసం కష్టపడిన నాయకులు. 2) సామాజిక వర్గాల వారీగా నాయకుల ఎంపిక. ఈ రెండు అంశాలపైనా నాయకులు తర్జన భర్జన పడుతున్నారు. ఎస్సీ మాదిగ, బీసీ, ఓసీ వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని గత కొన్నాళ్లుగా డిమాండ్లు తెరమీదికి వచ్చాయి. అయితే.. మంత్రి వర్గంలో ఒకరిద్దరికి అవకాశాలు కల్పించారు. అయినప్పటికీ.. మెజారిటీ పరంగా తమ కు న్యాయం జరగడం లేదని ఆయా వర్గాలు చెబుతున్నాయి. 3 లో

ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లల నిబంధన..సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: ఎన్నికల్లో పోటీ చేయాలంటే ఇద్దరు పిల్లలకు మించి ఉండకూడదనే నిబంధన ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతవరకు సమంజసమని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. దేశంలో సంతానోత్పత్తి రేటు గణనీయంగా తగ్గిన నేపథ్యంలో ఇద్దరికి మించి పిల్లలున్నవారిని స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హులుగా ప్రకటించే చట్టాలను పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. గత రెండు దశాబ్దాల్లో దేశ జనాభా పరిస్థితుల్లో గణనీయమైన మార్పులు వచ్చాయని బుధవారం విచారణ సందర్భంగా ధర్మాసనం పేర్కొంది. ప్రస్తుతం భారతదేశ మొత్తం సంతానోత్పత్తి రేటు (టీఎఫ్ఆర్) 2.1 అనే ప్రత్యామ్నాయ స్థాయి కంటే దిగువకు పడిపోయిందని గుర్తుచేసింది. ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే దశాబ్దాల్లో వృద్ధుల జనాభా పెరిగే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఇద్దరికి మించి పిల్లలున్నవారు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించడం ఇప్పటికీ అవసరమా? అని ప్రశ్నించింది. పూర్తిగా 4 లో

సీఈసీ పై కేరళ ప్రభుత్వ విచారణ



కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్‌పై అవినీతి ఆరోపణల నేపథ్యంలో కేరళం ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు అనుమతించింది. 2006లో కేరళం ప్రజాపనుల శాఖ (పీడబ్ల్యూడీ) కార్యదర్శిగా పనిచేసిన సమయంలో ప్రభుత్వ కాంట్రాక్టు బిల్లులు క్లియర్ చేసేందుకు రూ.2 కోట్లు లంచం డిమాండ్ చేశారన్న ఆరోపణలపై ఈ నిర్ణయం తీసుకుంది.అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17(ఏ) కింద విచారణకు అనుమతించినట్లు రాష్ట్ర హోంమంత్రి రమేశ్ చెన్నితల బుధవారం వెల్లడించారు. ముఖ్యమంత్రి వీడీ సతీశన్‌తో చర్చించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ బ్యూరో (వీఏసీబీ) చట్ట ప్రకారం తదుపరి చర్యలు చేపడుతుందని చెప్పారు.మలేసియాకు చెందిన ఇంజినీర్ లీ సీ బిన్ నుంచి జ్ఞానేశ్‌కుమార్ రూ. పూర్తిగా 3 లో

మొదటి పేజీ తరువాయి మధ్యంతర ఎన్నికల్లో ట్రంప్‌కు షాక్..

ఈ ఎన్నికల్లో ఓటర్లపై జీవన వ్యయం పెరగడం, అవినీతి ఆరోపణలు, ట్రంప్ పరిపాలనపై ఉన్న అసంతృప్తి వంటి అంశాలు ప్రధాన ప్రభావం చూపినట్లు ప్రాథమిక విశ్లేషణలు చెబుతున్నాయి. సాధారణంగా అధ్యక్షుడి పార్టీ మధ్యంతర ఎన్నికల్లో సీట్లు కోల్పోవడం చారిత్రకంగా జరుగుతున్నప్పటికీ, ఈసారి ఫలితాలు ఎలా ఉంటాయోనని ఉత్కంఠ నెలకొంది.ప్రస్తుతం ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. ముఖ్యంగా హోరాహోరీగా ఉన్న నియోజకవర్గాల్లో తుది ఫలితాలు వెలువడటానికి కొన్ని రోజులు పట్టే అవకాశం ఉంది. పశ్చిమ రాష్ట్రాల ఫలితాలు వెలువడిన తర్వాతే 'కాంగ్రెస్'పై ఎవరిది పైచేయి అనేది స్పష్టమవుతుంది.

మిచగన్ ఎన్నికల్లో అబ్దుల్ గెలుపు

అమెరికా రాజకీయాల్లో ఒక చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. దేశంలో అత్యంత కీలకమైన స్వింగ్ స్టేట్‌గా పరిగణించే మిచిగన్‌లో సెనేట్ స్థానానికి జరిగిన హోరాహోరీ ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీకి చెందిన అబ్దుల్ అల్-సయీద్ విజయం సాధించారు. తన సమీప రిపబ్లికన్ ప్రత్యర్థి మైక్ రోజర్స్‌పై గెలుపొందారు. దీంతో అమెరికా సెనేట్‌కు ఎన్నికైన తొలి ముస్లిం వ్యక్తిగా ఆయన చరిత్ర సృష్టించారు. ఈజిప్టు వలసదారుల కుమారుడైన అల్-సయీద్, గతంలో ప్రజారోగ్య అధికారిగా పనిచేశారు. ఇప్పటివరకు ఏ ఎన్నికల్లోనూ గెలవని ఆయన 'యూనివర్సల్ హెల్త్‌కేర్ (అందరికీ ఆరోగ్యం)', ఎన్నికల్లో ధన ప్రభావం తగ్గింపు, ఇజ్రాయెల్ విధానాలపై తీవ్ర విమర్శలు వంటి ప్రగతిశీల అజెండాతో ప్రజల్లోకి వెళ్లారు. అయితే, అల్-సయీద్ విజయం అంత సులభంగా దక్కలేదు. ప్రైమరీ ఎన్నికలతో పాటు సాధారణ ఎన్నికల్లోనూ ఆయనకు వ్యతిరేకంగా ప్రత్యర్థి వర్గాలు భారీగా డబ్బు ఖర్చుపెట్టాయి. ముఖ్యంగా ఇజ్రాయెల్‌కు అనుకూల సంస్థ అయిన 'అమెరికన్ ఇజ్రాయెల్ పబ్లిక్ అఫైర్స్ కమిటీ' (ఏఐపీఏసీ), ఆయన ఓటమి కోసం ఏకంగా 30 మిలియన్ డాలర్లు వెచ్చించింది. దీనికి తోడు రిపబ్లికన్లు ఆయనను ఉగ్రవాద సంస్థలతో ముడిపెడుతూ, దేశభక్తిని ప్రశ్నిస్తూ తీవ్ర ప్రచారం చేశారు.సొంత పార్టీలోనే అల్-సయీద్ తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వచ్చింది. ప్రైమరీలో ఆయనపై పోటీ చేసిన హేలీ స్టీవెన్స్, ఎన్నికలకు కొద్దిరోజుల ముందు అందరినీ ఆశ్చర్యపరుస్తూ రిపబ్లికన్ అభ్యర్థి మైక్ రోజర్స్‌కు మద్దతు ప్రకటించారు. యూదు సమాజం ఆందోళనలను అల్-సయీద్ సరిగా పరిష్కరించలేదని ఆమె ఆరోపించారు. దీంతో డెట్రాయిట్‌లోని నల్లజాతీయులు, యూదు ఓటర్ల మద్దతు కూడగట్టడం ఆయనకు సవాలుగా మారింది. చివరికి బరాక్ ఒబామా, కమలా హ్యారిస్ వంటి అగ్రనేతలు ప్రచారం చేసి పార్టీ శ్రేణులను ఏకం చేయాల్సి వచ్చింది.ఈ గెలుపు డెమోక్రటిక్ పార్టీలోని అభ్యుదయ, ప్రగతిశీల వర్గానికి భారీ స్థైర్యాన్ని ఇచ్చింది. 2028 అధ్యక్ష ఎన్నికల ముందు, తమ అజెండాతో స్వింగ్ స్టేట్స్‌లో కూడా గెలవగలమని నిరూపించినట్లయింది.

రిపబ్లికన్ల ఓటమి.. వ్యంగ్యంగా స్పందించిన ఎలాన్ మస్క్

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్లు ఘనవిజయం సాధించడంపై టెస్లా అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ వ్యంగ్యంగా స్పందించారు. రిపబ్లికన్ పార్టీకి వందల మిలియన్ డాలర్లు మద్దతుగా అందించినప్పటికీ ఆశించిన ఫలితాలు రాకపోవడంతో తన "ఎన్నికల్లో జోక్యం చేసుకునే స్పేస్ లేజర్లు" విఫలమయ్యాయంటూ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో చురకలు అంటించారు. "ప్రస్తుతం స్పేస్‌లో డేటా సెంటర్లు చాలా ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి" అని ఆయన మరో పోస్ట్ చేయడం గమనార్హం.యూఎస్ మధ్యంతర ఎన్నికల్లో డెమొక్రాట్లు అద్భుతమైన పనితీరు కనబరిచారు. యూఎస్ నెట్‌వర్క్‌ల అంచనాల ప్రకారం, సెనెట్‌తో పాటు ప్రతినిధుల సభలోనూ డెమొక్రాట్లు తిరిగి పట్టు సాధించారు. ఇది వాషింగ్టన్‌లో అధికార సమతుల్యతలో పెద్ద మార్పుకు సంకేతం. ముఖ్యంగా సాంప్రదాయకంగా రిపబ్లికన్ల కంచుకోటగా ఉన్న టెక్సాస్‌లోనూ డెమొక్రాట్లు గెలుపొందడం ఈ ఎన్నికల్లో కీలక పరిణామం. టెక్సాస్ నుంచి సెనెటర్‌గా ఎన్నికైన జేమ్స్ టలారికో.. మస్క్, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌లపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తన విజయోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ.. "మేం 300 మిలియన్ డాలర్లకు పైగా ఖర్చు చేసిన ప్రచారాన్ని ఎదుర్కొన్నాం. సోషల్ మీడియా అల్గారిథమ్‌లను శాసించే బిలియనీర్లకు వ్యతిరేకంగా పోరాడాం" అని మస్క్‌ను ఉద్దేశించి విమర్శించారు. ట్రంప్ హయాంలో రాజకీయాలు ఒక క్రీడగా, ట్రోలింగ్‌గా మారాయని ఆయన ఆరోపించారు.ఈ ఎన్నికల ప్రచారంలో రిపబ్లికన్ పార్టీకి మస్క్ అతిపెద్ద ఆర్థిక మద్దతుదారులలో ఒకరిగా నిలిచారు. ఎన్బీసీ న్యూస్ ప్రకారం.. రిపబ్లికన్ పార్టీ కాంగ్రెస్ ప్రచారాల కోసం ఆయన సుమారు 250 మిలియన్ డాలర్లు ఖర్చు చేశారు. ఇంత భారీగా ఖర్చు చేసినా రిపబ్లికన్లకు పరాజయం తప్పలేదు.డెమొక్రాట్ల విజయం టెక్నాలజీ, కృత్రిమ మేధ (ఏఐ) భవిష్యత్తుపై కొత్త ఆందోళనలను రేకెత్తిస్తోంది. ఈ ఫలితాల ప్రభావంతో స్టాక్ ఫ్యూచర్లు పడిపోయాయి. టెక్నాలజీ, డేటా సెంటర్ రంగాలపై డెమొక్రాట్ల విధానాలు ఎలా ఉంటాయోనన్న ఆందోళన మార్కెట్ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ఈ విజయంతో కాంగ్రెస్‌పై పూర్తి పట్టు సాధించిన డెమొక్రాట్లు, ట్రంప్ శాసనపరమైన అజెండాను సవాలు చేయడానికి సిద్ధమవుతున్నారు.

మొదటి పేజీ తరువాయి సోషల్ మీడియాలో కాదు..దమ్ముంటే సభలో చర్చకు రండి:రాహుల్‌కు నిర్మల సవాల్

"సమాధానాలు డిమాండ్ చేసేటప్పుడు, వాటిని వినే బాధ్యత కూడా ఉంటుంది. ఎన్నోసార్లు మీరు, మీ పార్టీ సభ్యులు ప్రభుత్వం స్పందిస్తున్న సమయంలోనే సభ నుంచి వాకౌట్ చేశారు. అలాంటప్పుడు చర్చకు అంత ఆసక్తిగా ఉన్నామని ఎలా చెప్పుకుంటారు?" అని ఆమె నిలదీశారు. ప్రతిపక్షాల ఆందోళనలతో పార్లమెంట్ సమావేశాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోతున్నాయని ఆమె విమర్శించారు. "మీకు చర్చపై నిజంగా అంత ఆసక్తి ఉంటే, ముందు పార్లమెంట్ కార్యకలాపాలు సజావుగా సాగేలా సహకరించవచ్చు కదా?" అని ప్రశ్నించారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నివాసంలో నిర్వహించిన "మాక్

మొదటి పేజీ తరువాయి పోలవరం-బనకచర్ల లింక్‌పై రేవంత్ సర్కార్ ద్వంద్వ వైఖరి

.. మరోవైపు కేంద్ర హోంమంత్రి అధ్యక్షతన జరిగిన దక్షిణాది రాష్ట్రాల కౌన్సిల్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు సమ్మతి తెలపడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని కవిత ఆరోపించారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణ నీటి హక్కులకు తీవ్ర విఘాతం కలుగుతుందని, 2024లోనే తెలంగాణ జాగృతి తరఫున తాము దీనిని వ్యతిరేకించామని గుర్తుచేశారు. "రాష్ట్రానికి హక్కుగా దక్కాల్సిన 250 టీఎంసీల గోదావరి జలాలను సీఎం రేవంత్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుకు 'గురుదక్షిణ'గా చెల్లించుకుంటున్నారు" అని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆమోదంతోనే ఏపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు విషయంలో ముందుకెళ్లేందుకు కేంద్రంపై ఒత్తిడి తెస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు జరిగే నష్టాన్ని గుర్తించాలని కవిత హెచ్చరించారు. ఈ ప్రాజెక్టుపై కేంద్రం జరిపే అన్ని సంప్రదింపుల నుంచి తెలంగాణ తక్షణమే వైదొలగాలని, ప్రాజెక్టును అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం వెంటనే లేఖ రాయాలని ఆమె డిమాండ్ చేశారు.

మొదటి పేజీ తరువాయి కోమటిరెడ్డికి మంత్రి పదవి దూరమయినట్లేనా?

ఈ ఫ్రస్టేషన్ అంతా మంత్రి పదవి దక్కకపోవడమే ప్రధాన కారణంగా కనపడుతుంది. ఇంకా తెలంగాన మంత్రి వర్గంలో ఖాళీలున్నప్పటికీ వాటిని భర్తీ చేయడంలో మాత్రం నాన్చుడు ధోరణిని వ్యవహరిస్తుండటాన్ని ఆయన సన్నిహితుల వద్ద ప్రస్తావిస్తున్నట్లు సమాచారం.కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి దూరం కాలేదని, సమయం వచ్చినప్పుడు న్యాయం జరుగుతుందని పార్టీ అధిష్టానం హామీ ఇచ్చిందని ఆయన గతంలో తెలిపారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులైనా తనకు మంత్రి పదవి ఇవ్వకపోవడంపై ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.తాజాగా గట్టుప్పల్ మండలంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మంత్రి పదవి ఇస్తామని మోసం చేశారని, నిధులు కూడా రావడం లేదని రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తనకు మంత్రి పదవి ఇస్తే ఎక్కడికో వెళ్లిపోతాననే ఉద్దేశంతోనే ఇవ్వడం లేదని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాకుండా మునుగోడు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి జరగకపోతే పదవులను పట్టుకుని వేలాడబోనని, అవసరమైతే ఎమ్మెల్యే పదవిని వదులుకోవడానికి కూడా వెనుకాడనని హెచ్చరించారు. మంత్రి పదవి మరియు నిధుల విషయంలో ఆయన చేస్తున్న ఈ సంచలన వ్యాఖ్యలు ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. అయితే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి దక్కకపోవడానికి అనేక కారణాలున్నాయి. సామాజికవర్గంతో పాటు ప్రధానంగా నల్లగొండ జిల్లాలో ఇప్పటికే ఇద్దరు మంత్రులు ఉండటం, అందులో ఆయన సోదరుడు వెంకటరెడ్డి ఉండటం కూడా మంత్రి పదవి దక్కకపోవడానికి ప్రధాన కారణమని చెబుతున్నారు. సమయం మించి పోతుందని, ఇప్పటి వరకూ హైకమాండ్ తనకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం లేదని ఆయన అన్న మాటల్లో అసంతృప్తితో పాటు ఆవేదన కూడా ఉంది. అవసరమైతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని చెప్పడం కూడా హెచ్చరిక కిందనే చూడాల్సి ఉంటుంది. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విషయంలో హైకమాండ్ స్పందించకపోతే కాంగ్రెస్ పార్టీకి త్వరలోనే గుణపాఠం చెబుతామని ఆయన అనుచరులు సోషల్ మీడియాలో హెచ్చరిస్తున్నారు

ఢిల్లీ నాయకుల ముందు రాష్ట్ర నేతలు వణికిపోతున్నారు..కేటీఆర్ ఘాటు విమర్శలు

- కాంగ్రెస్, బీజేపీలపై కేటీఆర్ ఘాటు విమర్శలు



సాక్షర: కాంగ్రెస్, బీజేపీ రెండూ తెలంగాణకు అన్యాయం చేస్తున్న పార్టీలేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఢిల్లీ నాయకుల ముందు రాష్ట్ర నేతలు వణికిపోతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ సంచులు మోసే పార్టీ అయితే.. బీజేపీ చెప్పులు మోసే పార్టీ అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ భవన్‌లో బుధవారం పలువురు నేతలు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అమిత్ షా హైదరాబాద్‌కు వస్తే బండి సంజయ్ బాడీగార్డ్‌లా వ్యవహరించారని కేటీఆర్ విమర్శించారు. ప్రియాంక గాంధీ భద్రతా సిబ్బంది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పక్కకు నెట్టేశారని ఆరోపించారు. కేంద్ర మంత్రి హోదాలో ఉన్న బండి సంజయ్ కరీంనగర్ ప్రజల గౌరవాన్ని దిగజార్చవద్దని హితవు పలికారు. తనకంటే చిన్నవాడైన అమిత్ షాకు రాంచందర్‌రావు కాళ్లకు నమస్కరించడమేంటని ప్రశ్నించారు. అమిత్ షా తెలంగాణకు వచ్చి చేతులు ఊపుకుంటూ వెళ్లిపోయారని, రాష్ట్రానికి ఏం ఇచ్చారని కేటీఆర్ నిలదీశారు. ఒక్క మెట్రో ప్రాజెక్టు, జాతీయ ప్రాజెక్టు లేదా విద్యాసంస్థనైనా మంజూరు చేశారా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి తరచూ ఢిల్లీ పర్యటనలు చేస్తూ రాజకీయ ప్రయోజనాల కోసమే తాపత్రయపడుతున్నారని విమర్శించారు. వారానికి రెండుసార్లు ఢిల్లీకి వెళుతూ ఆయన 'ఈఎంఐ ముఖ్యమంత్రి'గా మారిపోయారని ఎద్దేవా చేశారు. అడవులు నరికే వీరప్పన్‌ను అటవీశాఖ మంత్రిని చేసినట్లుగా.. భూములు అమ్మే బ్రోకర్‌ను ముఖ్యమంత్రిని చేస్తే ఎలా ఉంటుందో అలా ఉందని రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు

ఉత్కర్ కాటన్ మిల్లులో పత్తి కొనుగోళ్లపై బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహం

- మార్కెట్‌లో రూ.9,500..
- మిల్లులో రూ.8 వేలే..



పత్తి పండించిన రైతుకు మార్కెట్‌లో ఆశించిన ధర దక్కడం లేదని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నారాయణపేట జిల్లా నర్వ మండలం పాతర్చేడు గ్రామ పరిధిలోని ఉత్కర్ కాటన్ మిల్లులో క్వింటాల్ పత్తిని రూ.8 వేలకే కొనుగోలు చేస్తున్నారని, మార్కెట్‌లో మాత్రం రూ.9,500 ధర ఉందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. మార్కెట్ ధరకు, మిల్లులో చెల్లిస్తున్న ధరకు మధ్య క్వింటాల్‌కు రూ.1,500 వ్యత్యాసం ఉండటంతో రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. పెట్టుబడులు పెట్టి పండిస్తే.. తక్కువ ధరకేనా?: పత్తి సాగు కోసం రైతులు భారీగా పెట్టుబడులు పెట్టి,ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని పంటను పండిస్తున్నారని మహేశ్వర్ రెడ్డి అన్నారు. తీరా పంటను విక్రయించే సమయంలో తక్కువ ధర చెల్లిస్తే రైతులకు గిట్టుబాటు ఎలా అవుతుందని ప్రశ్నించారు. రైతుల శ్రమకు తగిన ప్రతిఫలం దక్కేలా క్వింటాల్ పత్తిని రూ.9,500 చొప్పున కొనుగోలు చేయాలని మిల్లు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. మిల్లులో పత్తి తూకంలోనూ మోసం జరుగుతోందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు స్పందించి కొనుగోళ్లను పర్యవేక్షించాలని, రైతులకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.నాయకులు శ్రీనివాస్ రెడ్డి, బి.ఆంజనేయులు, పార్టీ కార్యకర్తలు ఈ డిమాండ్లు చేశారు.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీ సీట్లపై కర్చీఫ్‌లు

మొదటి పేజీ తరువాయి


ఈ నేపథ్యంలో తాజాగా ఖాళీ అవుతున్న ఎమ్మెల్సీ స్థానాల్లో తమకు అవకాశం ఇవ్వాల్సిందేనని భీష్మిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ప్రస్తుతం `ఓట్ చోరీ` వ్యవహారంపై పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ దృష్టి పెట్టడంతో ఈ అంశంపై ఇంకా దృష్టి పెట్టలేదు. ఇక, సీట్లను ఆశిస్తున్న వారిలో చాలా మంది కాంగ్రెస్ సీనియర్లే ఉండడం గమనార్హం. దాదాపు పదేళ్ల పాటు పార్టీ కోసం పనిచేసిన నేతలు, ముఖ్యంగా రేవంత్ రెడ్డి తరఫున పార్టీలోకి వచ్చిన వారు కూడా ఇప్పుడు ఈ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. ఈ వ్యవహారం రాను రాను మరింత తీవ్రమవుతోంది. ఈ క్రమంలో మూడు సీట్లలో ఎస్సీ మాదిగలకు ఒకటి కేటాయించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో దొమ్మేటి సాంబయ్య ముందు వరుసలో నిలిచారు. అయితే..డిప్యూటీ సీఎం అనుచరుడిగా పేరున్న ప్రీతమ్ కూడా ఈ జాబితాలోనే ఉండడం గమనార్హం. అలాగే.. కొందరు మాజీ ఎమ్మెల్యేలు కూడా ఎమ్మెల్సీ రేసులో ఉన్నారు. సంపత్ కుమార్, చారుకొండ వెంకటేష్ తదితరులు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మరోవైపు ఒక్కసీటు కూడా తమకు కేటాయించరా? అంటూ.. బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వేణుగోపాల్ కూడా తెరమీదికి వచ్చారు. అలానే.. ఇతర నాయకులు కూడా పట్టు బడుతున్నారు. దీంతో ఈ వ్యవహారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో ఆసక్తికర చర్చకు దారితీసింది. బీసీ కోటాలో అనిల్, కైలాష్, జగదీశ్వర్, జక్కని అనితలు సై అంటున్నారు. మొత్తంగా ఉన్న మూడు స్థానాలకు దాదాపు 30 మందికి పైగా నాయకులు తలపడుతుండడం గమనార్హం

యూపీలో ఓట్ల చీలిక ఎవరికి దెబ్బ



సాక్షర,లక్నో: యూపీలో భారతీయ జనతా పార్టీ రాజకీయ ఆధిపత్యానికి మునుపెన్నడూ లేనంతగా సవాళ్లు ఎదురవుతున్నాయి. జాతీయ భద్రత, బలమైన కేంద్ర నాయకత్వం ప్రధాన అజెండాగా సాగిన లోక్‌సభ ఎన్నికల్లోనే యూపీ ఓటర్లు బీజేపీకి ఊహించని షాక్ ఇవ్వడం పార్టీకి మేల్కొలుపుగా మారింది. దాదాపు దశాబ్ద కాలంగా అధికారంలో ఉన్న యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని డబుల్ ఇంజిన్ సర్కార్‌పై పాలనాపరమైన అసంతృప్తి క్షేత్రస్థాయిలో విస్తరిస్తోందన్న సంకేతాలు వెలువడుతున్నాయి. జాతీయ నినాదాలే పూర్తిస్థాయిలో ప్రభావం చూపలేకపోయిన తరుణంలో, పూర్తిగా స్థానిక, సామాజిక అంశాల చుట్టూ తిరిగే అసెంబ్లీ సమరంలో కమలనాథులకు పెను పరీక్ష తప్పేలా లేదు.యోగి ప్రభుత్వంపై పెరుగుతున్న అసంతృప్తికి ప్రధానంగా నిరుద్యోగం, ప్రభుత్వ ఉద్యోగ పరీక్షల పేపర్ లీకేజీలు, వ్యవసాయ సంక్షోభం, పెరిగిపోయిన ద్రవ్యోల్బణం వంటి క్షేత్రస్థాయి సమస్యలే ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. వీటికితోడు శాంతిభద్రతల పేరిట జరిగిన కొన్ని కఠిన చర్యలు, బుల్డోజర్ న్యాయం కొన్ని సామాజిక వర్గాల్లో భయాందోళనలను, వ్యతిరేకతను పెంచాయి. ముఖ్యంగా ఓబీసీ, దళిత వర్గాలలో ప్రభుత్వ ప్రాధాన్యతలపై తలెత్తిన అనుమానాలు బీజేపీ సాంప్రదాయ ఓటు బ్యాంకులో చీలిక తెచ్చాయి. మరోవైపు ప్రభుత్వ యంత్రాంగం , పార్టీ క్యాడర్ మధ్య సమన్వయ లోపం, మంత్రులు-ఉపముఖ్యమంత్రుల మధ్య తలెత్తిన అంతర్గత విభేదాలు కూడా పాలనపై ప్రభావం చూపుతున్నాయి.ఈ రాజకీయ శూన్యతను సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ అత్యంత చాకచక్యంగా తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. గతంలో ఉన్న కేవలం యాదవ-ముస్లిం సమీకరణ పరిధిని దాటి, ఆయన ప్రయోగించిన పీడీఏ వెనుకబడిన, దళిత, మైనారిటీ వర్గాలు సామాజిక ఫార్ములా క్షేత్రస్థాయిలో విస్తృత ఆదరణ పొందుతోంది. రాజ్యాంగ పరిరక్షణ, కులగణన, రిజర్వేషన్ల హక్కుల పరిరక్షణను ప్రధాన అజెండాగా మార్చి అఖిలేష్ నిరంతరం ప్రజల్లో ఉండటం సమాజ్‌వాదీ పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. బహుజన్ సమాజ్ పార్టీ ప్రభావం గణనీయంగా తగ్గడంతో, బీజేపీ వ్యతిరేక ఓటుకు ఎస్పీయే ఏకైక ప్రత్యామ్నాయంగా నిలవడం అఖిలేష్ రాజకీయ గ్రాఫ్‌ను భారీగా పెంచింది.అయితే రాబోయే రాజకీయ పోరులో బీజేపీని ఎదుర్కోవడం అఖిలేష్‌కు నల్లేరుపై నడకేమీ కాదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. యోగి ఆదిత్యనాథ్‌కు వ్యక్తిగతంగా ఉన్న బలమైన హిందుత్వ ఇమేజ్, బీజేపీకి ఉన్న పటిష్టమైన బూత్ స్థాయి నెట్‌వర్క్, కేంద్ర పథకాల లబ్ధిదారుల వర్గం ఇప్పటికీ కాషాయ పార్టీకి కొండంత అండగా ఉన్నాయి. లోక్‌సభ ఎదురుదెబ్బల తర్వాత బీజేపీ సైతం దిద్దుబాటు చర్యలు చేపడుతూ, నాన్-యాదవ్ ఓబీసీలు, దళిత వర్గాలను తిరిగి ఆకర్షించేందుకు వ్యూహాత్మక మార్పులు చేస్తోంది. అఖిలేష్ హవా కొనసాగుతున్నప్పటికీ, తీవ్రస్థాయికి చేరిన ప్రభుత్వ వ్యతిరేకతను తన సంకీర్ణ కూటమి ద్వారా అసెంబ్లీ సీట్లుగా ఎంతవరకు మలచగలరన్న దానిపైనే యూపీ తదుపరి రాజకీయ భవితవ్యం ఆధారపడి ఉంటుంది.

మియాపూర్ భూములు అమ్మొద్దు...



సాక్షర,హైదరాబాద్: మియాపూర్‌లోని 550 ఎకరాల ప్రభుత్వ భూమి వస్తే అమ్మేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఆ భూములను అమ్మి సొమ్ము చేసుకోవాలని చూడకుండా, పేదలు, అమరవీరులు, ఉద్యమకారులకు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని హైదర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి తన అనుచరులతో కలిసి ఈరోజు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ... "మియాపూర్‌లోని 550 ఎకరాల్లో 200 ఎకరాలు పేదల ఇళ్లకు, 100 ఎకరాలు అమరవీరులకు, మరో 100 ఎకరాలు ఉద్యమకారులకు కేటాయించండి. మిగిలిన భూమిలో పాఠశాలలు, కాలేజీలు కడితే మనస్ఫూర్తిగా స్వాగతిస్తాం" అని అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో ఏడాదిలోపే కేసీఆర్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం వచ్చాక ఈ భూముల వ్యవహారాలపై దృష్టి సారిస్తామని స్పష్టం చేశారు.ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లు ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇచ్చే చిత్తశుద్ధి ఉందా అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఎక్కడో 80 కిలోమీటర్ల దూరంలోని ఎర్రవెల్లిలో కాకుండా, హైదరాబాద్ నగర నడిబొడ్డున ఉన్న మియాపూర్‌లోనే అమరవీరులకు ఇళ్లు కట్టివ్వాలని సవాల్ విసిరారు. 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ' పేరుతో జరుగుతున్న స్కాంలో భాగస్వాములైతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని పారిశ్రామికవేత్తలను ఆయన హెచ్చరించారు.

అల్వాల్ రైతుబజార్ను తొలగించవద్దు

- రైతుల జీవనోపాధిని కాపాడాలి
- ఎంపి ఈటలకు రైతుల విన్నపం



మేడ్చల్: అల్వాల్ రైతుబజార్ను తొలగిస్తే 1,500 రైతు కుటుంబాలకు నష్టం కలుగుతుందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ను రైతులు కలిసారు. అల్వాల్ రైతుబజార్ను ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం తొలగించనున్న నేపథ్యంలో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతుబజార్పై ఆధారపడిన సుమారు 1,500 రైతు కుటుంబాల జీవనోపాధిని కాపాడాలని ఎంపీ ఈటల రాజేందర్కు వినతిపత్రం అందజేశారు. మేడ్చల్, సిద్దిపేట, మెదక్, నల్గొండ జిల్లాల గ్రామాల నుంచి రైతులు ఇక్కడికి కూరగాయలు తీసుకొస్తున్నారు. ప్రతిరోజూ సుమారు 1,000 నుంచి 1,500 మంది రైతులు, వివిధ ప్రాంతాల నుంచి కూరగాయల విక్రయాలకు వస్తున్నట్లు పేర్కొన్నారు. 1999 జనవరి 26 నుంచి సుమారు 26 ఏళ్లుగా రైతుబజార్ రైతులకు జీవనాధారంగా కొనసాగుతోందని తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రైతులు నేరుగా వినియోగదారులకు తక్కువ ధరలకు కూరగాయలు విక్రయిస్తున్నారని వివరించారు. రైతుబజార్ను తొలగించే పరిస్థితి ఉంటే అల్వాల్ పరిసర ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ స్థలం కేటాయించి రైతుల జీవనోపాధిని కాపాడాలని ఈటలను విజ్ఞప్తి చేశారు.

మొదటి పేజీ తరువాయి సీఈసీ పై కేరళ ప్రభుత్వ విచారణ

2 కోట్లు డిమాండ్ చేశారంటూ కాంట్రాక్టర్ వీ.ఓ. సాజన్ గతంలో ఆరోపించారు. కేరళ స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ ప్రాజెక్టు (కేఎస్‌టీపీ) పనులు చేపట్టిన పాథిబెల్ సంస్థకు లీ సీ బిన్ అనుబంధంగా పనిచేశారు. ఆ సంస్థకు సాజన్ సబ్ కాంట్రాక్టర్‌గా మెటీరియల్ సరఫరా చేసేవారు.పెండింగ్‌లో ఉన్న బిల్లులను జ్ఞానేశ్‌కుమార్ నిలిపివేసి, వాటిని విడుదల చేయడానికి రూ.2 కోట్లు అడిగారని సాజన్ మీడియాకు వెల్లడించారు. బిల్లులు చెల్లించకపోవడంతో లీ తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యారని, ఈ విషయాన్ని తనతో చెప్పుకొన్నారని ఆయన పేర్కొన్నారు. అనంతరం లీ ఆత్మహత్య చేసుకుని మరణించారు.జ్ఞానేశ్‌కుమార్ ప్రస్తుతం సీఈసీగా ఉన్నప్పటికీ, గతంలో పీడబ్ల్యూడీ కార్యదర్శిగా పనిచేసిన సమయంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఘటనపై విచారణకు ఎలాంటి అడ్డంకి లేదని చెన్నితల స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు తీర్పులు కూడా విచారణకు ఆటంకం లేదని చెబుతున్నాయని అన్నారు. సీఈసీ పదవికి సంబంధించిన రక్షణ, గతంలో నిర్వహించిన ఇతర పదవుల్లో తీసుకున్న చర్యలకు వర్తించదని వివరించారు.గతంలో జరిగిన విజిలెన్స్ విచారణ జ్ఞానేశ్‌కుమార్‌కు క్లీన్‌చిట్ ఇచ్చేందుకే ఉద్దేశించినట్లు సాజన్ ఆరోపించారు. తాజా అనుమతితో ఈ వ్యవహారంపై మరోసారి విచారణకు మార్గం సుగమమైంది.

మొదటి పేజీ తరువాయి కేసీఆర్‌కు పేరు వస్తుందనే నీళ్లివ్వడం లేదు వేముల ప్రశాంత్ రెడ్డి

ఈ సందర్భంగా బ్యారేజీ స్థితిగతులను, నీటి లభ్యతను వారు పరిశీలించారు.అనంతరం వేముల ప్రశాంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందన్న కుట్రతోనే కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోయడం లేదని ఆరోపించారు. బ్యారేజీ వద్ద పుష్కలంగా నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, వాటిని ఉద్దేశపూర్వకంగా సముద్రం పాలు చేస్తున్నారని మండిపడ్డారు. నిత్యం సుమారు 22,000 క్యూసెక్కుల నీరు వృథాగా పోతోందని, ఈ నీటిని పంపింగ్ చేస్తే రైతుల పంటలను కాపాడవచ్చని ఆయన అన్నారు. బ్యారేజీ కూలిపోయిందని ప్రభుత్వం చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని,85 పిల్లర్లు పటిష్ఠంగానే ఉన్నాయని ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నీటిని ఎత్తిపోయకపోతే, బీఆర్ఎస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో పెద్ద ఎత్తున 'రైతు పోరుబాట' నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ పర్యటనలో మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, గంప గోవర్ధన్, జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనజాతి గౌరవ దివస్ నాల్గవ రోజు వేడుకల్లో భాగంగా దండారి గుస్సాడి



- ముఖ్య అతిథిగా పాల్గొన్న డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ

సాక్షర,కుమురం భీమ్ ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల బాలురులో జనజాతి గౌరవ దివస్ వేడుకల్లో భాగంగా నాల్గవ రోజు దండారి గుస్సాడి సాంస్కృతిక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గిరిజనుల ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలు, కళారూపాలను ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముందుగా ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించి గిరిజన సంప్రదాయాలకు అనుగుణంగా వేడుకలను ప్రారంభించారు. అనంతరం కళాకారులు ప్రదర్శించిన దండారి గుస్సాడి నృత్యాలను ఆసక్తిగా తిలకించారు. గుస్సాడి కళాకారుల సంప్రదాయ వేషధారణలు, నృత్యరీతులు, వాయిద్యాల నడుమ సాగిన ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ మాట్లాడుతూ.. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో ప్రాచీనమైనవని, విశిష్టమైనవని పేర్కొన్నారు. గిరిజన సమాజానికి ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చే దండారి, గుస్సాడి వంటి కళారూపాలను భవిష్యత్ తరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు భగవాన్ బిర్సా ముండా, కొమురం భీమ్, కుమారం సూరు వంటి మహనీయ గిరిజన పోరాట యోధుల చరిత్రను తెలుసుకోవాలని, వారు చూపిన ధైర్యసాహసాలు, త్యాగాలు, పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.విద్యార్థులు చదువుతో పాటు తమ మూలాలను మరచిపోకుండా గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను గౌరవించాలని, వాటి పరిరక్షణలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు తమ వారసత్వ సంపదపై అవగాహన పెరగడంతో పాటు మన సంస్కృతిపై గౌరవం, అభిమానం ఏర్పడతాయని తెలిపారు.జనజాతి గౌరవ దివస్ వేడుకల ద్వారా గిరిజన మహనీయుల చరిత్రను, వారి పోరాటాలను, ఆదివాసీ కళలు మరియు సంప్రదాయాల గొప్పతనాన్ని విద్యార్థులకు పరిచయం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి మడావి శేఖు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, వార్డెన్ మధుకర్, ఆశ్రమ పాఠశాల బాలికల ప్రధానోపాధ్యాయులు లింబారావు, ఎస్‌సీఆర్‌పీ రాథోడ్ రవీందర్, పాఠశాల సిబ్బంది, రాజ్ గోండ్ సేవా సమితి నాయకులు నానేష్, సిడాం కైలాష్, మనీష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.గిరిజన సంస్కృతి వైభవాన్ని చాటిచెప్పిన దండారి గుస్సాడి నృత్య ప్రదర్శనతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.

న్యూఢిల్లీలో జైరాం రమేష్‌ను కలిసిన ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ నాయకులు

- జిల్లా రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతంపై చర్చ



(ఆదిలాబాద్, సాక్షర): ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ నాయకులు న్యూఢిల్లీలో ఏఐసీసీ సీనియర్ నాయకులు, కేంద్ర మాజీ మంత్రి, ఏఐసీసీ మీడియా ఇన్‌చార్జి, సీడబ్ల్యూసీ సభ్యులు జైరాం రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సందర్భంగా ఆదిలాబాద్ జిల్లాలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యాచరణ, రాబోయే రోజుల్లో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, జిల్లాలో అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై ఆయనతో చర్చించారు.అదేవిధంగా జైరాం రమేష్‌కు ఆదిలాబాద్ జిల్లాతో ఉన్న ప్రత్యేక అనుబంధాన్ని, గతంలో జిల్లాలో ఆయనకు ఉన్న పరిచయాలు, అనుబంధాలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. జిల్లాలో పార్టీ పరిస్థితులు, ప్రజా సమస్యలు, అభివృద్ధికి సంబంధించిన అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్, ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు సాజిద్ ఖాన్, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బలోపేతం, జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించి ఏఐసీసీ స్థాయిలో జరిగిన ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది.

తాగు నీటికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ కె.హరిత



(ఆసిఫాబాద్ ప్రతినిధి, సాక్షర): జిల్లాలో త్రాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతిరోజు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల కలెక్టర్ ఛాంబర్ లో పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, ఇంట్రా గ్రిడ్ అధికారులతో త్రాగునీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి గ్రామానికి త్రాగునీటి సరఫరా చేయాలని, ఏ గ్రామంలో తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ నెల 16వ తేదీ నుండి డిసెంబర్ 31వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని, ప్రతి బోరు, సింగిల్ పేజ్ మోటారు, ఓవర్ హెడ్ ట్యాంకులు, గ్రిడ్ పైప్ లైన్ల పనులను పరిశీలించి, మరమ్మత్తు ఉన్నట్లయితే వెంటనే చేపట్టాలని తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేసి త్రాగునీటి సమస్య రాకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, మిషన్ భగీరథ ఈ.ఈ. రాకేష్, ఇంట్రా గ్రిడ్ ఈ.ఈ. ఎంఎ. సిద్ధికి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై యువతకు అవగాహన కల్పించాలి

- -మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్



(ఆదిలాబాద్, సాక్షర):ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన యువత నాయకత్వ అవగాహన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి పౌరుడు తన ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని అన్నారు.ముఖ్యంగా యువత ఎన్నికల ప్రక్రియపై అవగాహన కలిగి ఉండటంతో పాటు, సమాజంలో చైతన్యం తీసుకువచ్చేలా ముందుండాలని సూచించారు.యువత కేవలం విద్యకే పరిమితం కాకుండా నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని, సామాజిక బాధ్యతతో సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు.ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, దేశ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఓటు హక్కు, ప్రజాస్వామ్య వ్యవస్థ, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించడం అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ తెలిపారు.

జాతీయ బీసీ కమిషన్ చైర్‌పర్సన్ కుబహిరంగ లేఖ



- జనగణనలో ఓబీసీ కాలం, యూనిక్ కోడ్ కోసం సిఫార్సు చేయాలని వినతి

(మంచిర్యాల ప్రతినిధి, సాక్షర): కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జనగణనలో ఓబీసీ కాలం చేర్చి కులానికి ఒక యూనిక్ కోడ్ పెట్టే విధంగా కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సులు చేయాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి పక్షాన జాతీయ బీసీ కమిషన్ చైర్‌పర్సన్ సాధ్వి నిరంజన్ జ్యోతికి బహిరంగ లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు బుధవారం మంచిర్యాల పట్టణంలోని ఇస్లాంపూర్ ప్రాంతంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 80 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ, ఇప్పటివరకు ఏ ప్రభుత్వం కూడా సమగ్రంగా బీసీ కులగణన చేపట్టకపోవడం విచారకరమన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పార్లమెంట్ సాక్షిగా కులగణన చేపడతామని ప్రకటించినప్పటికీ, ప్రస్తుతం నిర్వహిస్తున్న జనగణనలో ప్రత్యేకంగా ఓబీసీ కాలమ్ ఏర్పాటు చేయకపోవడం బీసీ సమాజానికి అన్యాయం చేయడమేనని విమర్శించారు.జనగణనలో ఓబీసీ కాలమ్ చేర్చి బీసీల జనాభా లెక్కలు సేకరిస్తే, జనాభా దామాషా ప్రకారం బీసీలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, విద్యా, ఉద్యోగ రంగాల్లో తగిన అవకాశాలు కల్పించాల్సి వస్తుందనే ఉద్దేశంతో పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారా అని ప్రశ్నించారు.దేశంలోని అన్ని వర్గాల జనాభా వివరాలు సేకరిస్తున్న ప్రభుత్వాలు బీసీల విషయంలో మాత్రం స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమన్నారు. బీసీలకు రావాల్సిన సామాజిక, రాజకీయ వాటాను ఇంకా ఎన్నాళ్లు దూరం చేస్తారని ప్రశ్నించారు.కావున జాతీయ బీసీ కమిషన్ చైర్‌పర్సన్ సాధ్వి నిరంజన్ జ్యోతి ఈ అంశంపై ప్రత్యేకంగా దృష్టి సారించి, జనగణనలో ఓబీసీ కాలమ్ చేర్చడంతో పాటు ప్రతి బీసీ కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ కేటాయించే విధంగా కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సులు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం బీసీల న్యాయమైన డిమాండ్‌ను, బీసీ సమాజ ఉద్యమ ఆకాంక్షను గుర్తించి జనగణనలో ఓబీసీ కాలమ్ ఏర్పాటు చేసి బీసీలకు న్యాయం చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి పెద్దల్ల చంద్రకాంత్, రాష్ట్ర నాయకులు గజ్జల వెంకటయ్య, కడారి సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి కలుషిత నదిగా మంజీరా

కానీ, మంజీర నదిలో సింగూరు నుంచి పాపన్నపేట మధ్య బీవోడీ స్థాయి 12 మిల్లీగ్రాములుగా నమోదైంది, ఇది సాధారణ పరిమితి కంటే మూడు రెట్లు ఎక్కువ. మూసి నది కూడా తీవ్ర కాలుష్యంతో బాధపడుతోంది. బాపూఘాట్ నుంచి నది కృష్ణాలో కలిసే వాడపల్లి వరకు ఉన్న పరివాహక ప్రాంతంలో, మూసి నది బీవోడీ స్థాయి 9 మిల్లీగ్రాములుగా నమోదైంది. ఇది పరిమితి కంటే రెండు రెట్లు ఎక్కువగా ఉంది.కృష్ణ మరియు గోదావరి నదులలో కూడా బీవోడీ స్థాయిలు పరిమితిని దాటాయి. గద్వాల బ్రిడ్జి నుంచి వాడపల్లి మధ్య కృష్ణా నదిలో 3. 6 మిల్లీగ్రాములు, పొచ్చెర జలపాతం నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మధ్య గోదావరి నదిలో 3.6 మిల్లీగ్రాముల చొప్పున బీవోడీ నమోదైంది. ఈ వివరాలు ప్రజలకు నదుల కాలుష్యంపై అవగాహన కల్పించేందుకు అవసరమైనవి. రాష్ట్రవ్యాప్తంగా పీసీబీ 57 ప్రాంతాల నుంచి 580 నీటి నమూనాలను సేకరించి ఈ విశ్లేషణ నిర్వహించినట్లు నివేదిక స్పష్టం చేసిందికాలుష్య నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, అందుకు సంబంధించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవడం ద్వారా, నదుల నాణ్యతను మెరుగుపరచవచ్చు. ఈ నివేదిక ప్రజల దృష్టిని ఆకర్షించడానికి, కాలుష్యానికి కారణమైన అంశాలను గుర్తించడానికి మరియు వాటిని నివారించడానికి ప్రేరణగా నిలుస్తుంది.నదుల పరిరక్షణకు ప్రభుత్వం, ప్రజలు కలిసి పనిచేయాలి. కాలుష్య నివారణకు సమర్థవంతమైన విధానాలు రూపొందించడం, అమలు చేయడం అత్యంత అవసరం. ఇది తెలంగాణ రాష్ట్రంలో నీటి నాణ్యతను మెరుగుపరచడానికి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడానికి, పర్యావరణాన్ని రక్షించడానికి కీలకమైన దశగా మారవచ్చు. కాలుష్యాన్ని నివారించడం ద్వారా, మంజీర, మూసి, కృష్ణ, గోదావరి వంటి నదుల పునరుద్ధరణకు దోహదపడవచ్చు.

మొదటి పేజీ తరువాయి అమెరికా మధ్యంతర ఎన్నికలు..సత్తా చాటుతున్న భారత సంతతి అభ్యర్థులు

కేరళ మూలాలున్న వివేక్‌కు అధ్యక్షుడు ట్రంప్ మద్దతు ప్రకటించారు. తాజా సమాచారం ప్రకారం, ఆయన తన ప్రత్యర్థి, డెమోక్రటిక్ అభ్యర్థి అమీ యాక్టన్ కంటే దాదాపు 2,00,000 ఓట్ల వెనుకంజలో ఉన్నారు. మరోవైపు ఫ్లోరిడా 22వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి డెమోక్రటిక్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పియా దండియా ఆధిక్యంలో కొనసాగుతున్నారు. మాజీ హైస్కూల్ ప్రిన్సిపాల్ అయిన ఆమె, రిపబ్లికన్ అభ్యర్థి కేసీ అస్కర్‌పై దాదాపు 11,000 ఓట్ల ఆధిక్యంతో ముందంజలో ఉన్నారు. సిలికాన్ వ్యాలీలోని కొన్ని ప్రాంతాలున్న కాలిఫోర్నియా 17వ డిస్ట్రిక్ట్‌లో ఇద్దరు భారత సంతతి నేతల మధ్య ఆసక్తికర పోరు నెలకొంది. ఇక్కడ డెమోక్రటిక్ కాంగ్రెస్ సభ్యుడు రో ఖన్నాపై రిపబ్లికన్ నేత రితేష్ టాండన్ పోటీ చేస్తున్నారు. అలాగే వాషింగ్టన్‌లోని 7వ డిస్ట్రిక్ట్‌లో సిట్టింగ్ కాంగ్రెస్ సభ్యురాలు ప్రమీలా జయపాల్‌పై మరో భారత సంతతికి చెందిన రిపబ్లికన్ నేత నీరవ్ సేథ్ బరిలో ఉన్నారు. ఈ రెండు చోట్లా ఫలితాలు ఇంకా వెలువడలేదు. వీరితో పాటు సిట్టింగ్ కాంగ్రెస్ సభ్యుడు అమీ బేరా (కాలిఫోర్నియా), అమీష్ షా (అరిజోనా), పూజా సేథి (టెక్సాస్), సందీప్ శ్రీవాస్తవ (టెక్సాస్) వంటి అనేకమంది భారత సంతతి అభ్యర్థులు వివిధ స్థానాల నుంచి పోటీ పడుతున్నారు. లాస్ ఏంజిల్స్ నగర మేయర్ పదవికి నిత్యా రామన్ పోటీ చేస్తున్నారు. ఆమె గెలిస్తే, అమెరికాలోని రెండు అతిపెద్ద నగరాలైన న్యూయార్క్, లాస్ ఏంజిల్స్‌కు భారత సంతతికి చెందినవారే మేయర్లుగా ఉంటారు. కొన్ని చోట్ల ఫలితాలు వెలువడినప్పటికీ, పలువురు కీలక భారత సంతతి అభ్యర్థుల భవితవ్యం తేలాల్సి ఉండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

మొదటి పేజీ తరువాయి ఈ నెల కరెంట్ భారం...

మొత్తం రూ.7,635 కోట్లలో రూ. 5,420 కోట్లు వ్యవసాయేతర వినియోగదారుల నుంచి వసూలు చేయాలని నిర్ణయించారు. మిగతా మొత్తం వ్యవసాయ విభాగానికి సంబంధించినది కావడంతో ప్రభుత్వం దాన్ని భరిస్తుంది.నవంబర్ నెలలో యూనిట్‌కు 30 పైసలు, డిసెంబర్ నుంచి యూనిట్‌కు 50 పైసలు చొప్పున ఈ ఛార్జీలు వసూలు చేయబడతాయి. ఉదాహరణకు, 100 యూనిట్లు వినియోగించే వినియోగదారులకు నవంబర్‌లో రూ.30 అదనంగా చెల్లించాల్సి వస్తుందఈ ఛార్జీలు సాధారణ బిల్లుతో కలిపి చూపించకుండా ప్రత్యేకంగా చూపించబడతాయి. దక్షిణ డిస్కం పరిధిలో 29 నెలలు, ఉత్తర డిస్కం పరిధిలో 26 నెలల పాటు ఈ వసూళ్లు కొనసాగుతాయి. అయితే, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల లోపు కరెంట్ వినియోగించే వారికి ఉపశమనం ఉంది.ప్రభుత్వ విధానాల ప్రకారం, ఈ వినియోగదారులకు జీరో బిల్లు అందించబడుతుంది. అందువల్ల, ట్రూ-అప్ ఛార్జీల భారం గృహజ్యోతి లబ్ధిదారులపై పడదు. ప్రస్తుతం 200 యూనిట్ల లోపు వినియోగం ఉన్న వారికి బిల్లు మైనస్‌లోనే వస్తోంది.కాబట్టి, ఈ పథకం ద్వారా పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు కొంత ఉపశమనం లభిస్తోంది. వినియోగదారులు తమ కరెంట్ బిల్లులను జాగ్రత్తగా పరిశీలించాలి. ట్రూ-అప్ ఛార్జీలు ప్రత్యేకంగా చూపించబడుతున్నందున, అవి బిల్లులో స్పష్టంగా కనిపిస్తాయి.ఏదైనా సందేహం ఉంటే సంబంధిత డిస్కం కస్టమర్ కేర్‌ను సంప్రదించడం మంచిది. ఈ చర్య వల్ల సాధారణ వినియోగదారులపై కొంత భారం పడుతున్నప్పటికీ, గృహజ్యోతి పథకం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలకు కొంత ఉపశమనం కలుగుతోంది. విద్యుత్ వినియోగదారులు ఈ కొత్త ఛార్జీల గురించి అవగాహన కలిగి ఉండటం చాలా అవసరం. తద్వారా వారు తమ బిల్లులను సరిగ్గా అర్థం చేసుకుని, అవసరమైన చర్యలు తీసుకోగలరు.

అధ్వానంగా అంతర్రాష్ట్ర రహదారి

- గుంతలతో ప్రయాణికుల అవస్థలు
- తాత్కాలిక మరమ్మతులతో వృథా అవుతున్న ప్రజాధనం
- శాశ్వత మరమ్మతులు చేయాలని డిమాండ్



(తలమడుగు, సాక్షర): ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నుంచి సుంకిడి మీదుగా మహారాష్ట్రలోని కిన్వాట్, మాహూర్ ప్రాంతాలకు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారి అధ్వానంగా మారింది. రహదారిపై అడుగడుగునా ఏర్పడిన గుంతలు ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి.నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులు రోడ్డు దుస్థితితో అవస్థలు పడుతున్నారు. రెండు రాష్ట్రాల మధ్య రవాణాకు కీలకంగా ఉన్న ఈ రహదారి నిర్వహణపై సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నుంచి సుంకిడి, కిన్వాట్ మీదుగా మాహూర్‌కు వెళ్లే ఈ మార్గం తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాల ప్రజలకు ఎంతో ముఖ్యమైనది. వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, నిత్య ప్రయాణాలు, ఇతర అవసరాల కోసం అనేకమంది ఈ రహదారిని వినియోగిస్తుంటారు. ముఖ్యంగా సరిహద్దు ప్రాంత గ్రామాల ప్రజలకు ఈ మార్గం ప్రధాన రవాణా సౌకర్యంగా ఉంది.అయితే తెలంగాణ సరిహద్దు వరకు రహదారి దెబ్బతినడంతో ప్రయాణం సాఫీగా సాగడం లేదు. రహదారిపై పలుచోట్ల పెద్దపెద్ద గుంతలు ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనదారులు గుంతలను తప్పించేందుకు ప్రయత్నించే క్రమంలో ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం ఉంది. రాత్రి వేళల్లో గుంతలు సరిగా కనిపించకపోవడంతో ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారుతోంది.ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించుకుంటూ గుంతలను దాటాల్సి రావడంతో డ్రైవర్లు అప్రమత్తంగా వాహనాలు నడపాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా వర్షాలు కురిసిన సమయంలో గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో వాటి లోతు తెలియక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.ఇటీవల సంబంధిత అధికారులు రహదారిపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేయించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. కొద్దిరోజులకే మరమ్మతులు చేసిన ప్రాంతాల్లో తిరిగి గుంతలు ఏర్పడటం పనుల నాణ్యతపై అనుమానాలకు తావిస్తోంది. తాత్కాలికంగా గుంతలను పూడ్చి చేతులు దులుపుకోవడం వల్ల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ప్రజాధనాన్ని వెచ్చించి మరమ్మతులు చేపడుతున్నప్పటికీ రహదారి పరిస్థితిలో ఆశించిన మార్పు కనిపించకపోవడం విమర్శలకు దారితీస్తోంది. పనుల నాణ్యతను పర్యవేక్షించాల్సిన అధికారులు ఎక్కడున్నారనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. మరమ్మతుల పేరుతో నిధులు ఖర్చు చేస్తున్నా కొద్ది రోజులకే రహదారి మళ్లీ దెబ్బతింటే ఆ పనుల వల్ల ప్రయోజనం ఏమిటని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.సంబంధిత శాఖ ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి ఆదిలాబాద్ నుంచి సుంకిడి మీదుగా కిన్వాట్, మాహూర్ వెళ్లే అంతర్రాష్ట్ర రహదారిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. కేవలం తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకుండా నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా శాశ్వత మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల ప్రాణాలకు, వాహనాల భద్రతకు ముప్పుగా మారుతున్న గుంతలను తక్షణమే పూడ్చడంతో పాటు రహదారి నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి: కలెక్టర్ రాజర్షిషా



(నార్నూర్, సాక్షర):జిల్లాలోని నార్నూర్ మండలంలో కొనసాగుతున్న సమగ్ర భూముల రీ-సర్వే, ఎన్‌మెంట్ సర్వే పనులను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. బుధవారం నార్నూర్ మండలంలోని గంగాపూర్ (జి) గ్రామంలో రీసర్వే పక్రియను ఉట్నూర్ సబ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్ తో కలిసి ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించి అధికారులకు దిశనిర్దేశం చేశారు .ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూముల రీసర్వే పక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. గంగాపూర్, మాదాపూర్, ఖైర్దట్వా, సోనాపూర్ గ్రామాల్లో రీ-సర్వే ప్రక్రియను తలపెట్టగా, ప్రస్తుతం గంగాపూర్ పరిధిలో సర్వే పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. ఈ రీ-సర్వేలో భాగంగా ఇప్పటివరకు 6 కిలోమీటర్ల మేర హద్దుల గుర్తింపు పూర్తయిందనీ తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా కలెక్టర్ స్వయంగా గంగాపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 2 భూములను, గ్రామ కంఠాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోవర్ పరికరం పని విధానం, బౌండరీ హద్దులు ఎలా నిర్ధారించారు, డేటా ఫీడింగ్ సక్రమంగా జరుగుతుందా లేదా అనే అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు అందజేశారు. ప్రభుత్వ భూములకు తొలి ప్రాధాన్యతనిచ్చి సర్వే పూర్తి చేసి, అన్ని వివరాలు డేటాను జాగ్రత్తగా సేవ్ చేసుకోవాలని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో ఉట్నూర్ సబ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్, తహసిల్దార్ రాజలింగు, ఎంపిడిఓ పుల్లయ్య, సర్పంచ్ ఉష, డిప్యూటీ ఇన్స్పెక్టర్ జయరాం, సర్వేయర్లు, ఇతర అధికారులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లల నిబంధన..సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

మహారాష్ట్రలోని కాకోడా గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ మంగళ భీమ్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. మూడో సంతానం జన్మించడంతో ఆమెను ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హురాలిగా ప్రకటించారు. ఆమె అప్పీల్‌ను అనుమతించిన సుప్రీంకోర్టు, అనర్హత నిర్ణయాన్ని రద్దు చేసింది. ఇదే అంశంపై 2003లో వెలువడిన జావేద్ వెలువడినప్పుడు దేశంలో ఒక్కో వర్సెస్ హర్యానా రాష్ట్రం తీర్పును కూడా మహిళకు సగటున ముగ్గురు పిల్లలు సుప్రీంకోర్టు పునఃపరిశీలనకు స్వీకరించింది. ఆ తీర్పును విస్తృత ధర్మాసనానికి నివేదించింది. హర్యానా పంచాయతీరాజ్ చట్టం-1994 ప్రకారం ఇద్దరికి మించి పిల్లలున్నవారు పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులని అప్పట్లో ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం సమర్థించింది. 2003లో ఆ తీర్పు ఉండేవారని, జనాభా నియంత్రణ ప్రధాన విధానపరమైన అంశంగా ఉండేదని ప్రస్తుత ధర్మాసనం గుర్తుచేసింది. ఇప్పుడు పరిస్థితులు మారినందున ఈ నిబంధనలు రాజ్యాంగబద్ధంగా కొనసాగాలా? లేదా? అన్నది విస్తృత ధర్మాసనం తేల్చనుంది. అయితే, ఇద్దరు పిల్లల నిబంధనను దేశవ్యాప్తంగా రద్దు చేసినట్లు సుప్రీంకోర్టు ప్రకటించలేదు.

ఏసీబీ వలలో బజార్ హత్నూర్ ఎస్సై రమేష్

- రూ.40 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత



(బజార్ హత్నూర్, సాక్షర): ఆదిలాబాద్ జిల్లాలో ఓ అవినీతి పోలీస్ అధికారి అవినీతి నిరోధక శాఖ అధికారులకు రూ.40 వేలు లంచం తీసుకుంటుండగా అడ్డంగా దొరికిపోయాడు.ఒక కేసు వ్యవహారంలో బాధితుడి నుంచి రూ.50 వేలు లంచం డిమాండ్ చేశారు. చివరికి రూ.40 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వలపన్ని రెడ్ హ్యాండెడ్ గా బుధవారం పట్టుకున్నారు.ఈ సంఘటన ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండల పోలీస్ స్టేషన్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న రమేష్ అవినీతి బాగోతం వెలుగు చూసింది.ఓ కేసు విషయంలో రూ.50 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే అంత ఇచ్చుకోలేనని బాధితుడు బ్రతిమిలాడితే చివరికి రూ.40 వేలు లంచం ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నాడు.ఎస్సై రమేష్ వేధింపులు భరించలేని బాధితుడు నేరుగా అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించాడు.బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ డిఎస్పీ గొర్రె మధు పక్కా ప్రణాళికతో వల పన్నాడు. డిఎస్పీ మధు ఆధ్వర్యంలో అధికారులు వ్యూహాత్మకంగా వ్యవహరించి బాధితుడి వద్ద నుంచి ఎస్సై రమేష్ రూ.40 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.వెంటనే ఎస్సై రమేష్ ను అదుపులోకి తీసుకొని, ఏసీబీ అధికారులు బజార్ హత్నూర్ పోలీస్ స్టేషన్ లో సోదాలు చేపట్టారు. ఎస్సైపై కేసు నమోదు చేసి తదుపరి చర్యలు తీసుకున్నారు.ఈ సందర్భంగా ఏసీబీ అధికారి మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం అడిగితే తక్షణమే తమను సంప్రదించాలని ప్రజలకు సూచించారు.

రాష్ట్రస్థాయి పీఎం శ్రీ అండర్ 17 కబడ్డీ పోటీలకు నిర్మల్ జిల్లా జట్టు



(నిర్మల్, ప్రతినిధి, సాక్షర): రాష్ట్రస్థాయి పీఎం శ్రీ అండర్ 17 కబడ్డీ పోలీస్ అకాడమీ హైదరాబాద్ నందు 5, 6 తేదీలలో నిర్వహించబడే పోటీలలో పాల్గొనేందుకు జిల్లా నుండి ఎన్నిక చేయబడిన పీఎం శ్రీ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు ఈరోజు హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు.వీరికి జిల్లా విద్యాశాఖ తరఫున స్పోర్ట్స్ యూనిఫామ్ ఇవ్వడం జరిగినది. కార్యక్రమంలో సెక్టోరల్ అధికారి నరసయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్, అంబాజీ, రమణారావు, పోశెట్టి, దేవేందర్, జమున, రాధిక పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మె



- 23వ రోజుకు చేరిన సమ్మె
- ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్

(నిర్మల్ ప్రతినిధి, సాక్షర): తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో తమ హక్కుల సాధన కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు స్పష్టం చేశారు.నిర్మల్ జిల్లా ఎన్‌హెచ్‌ఎం జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరవధిక సమ్మె బుధవారం 23వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఉద్యోగులు చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.తెలంగాణ రాష్ట్రంలోని ఎన్‌హెచ్‌ఎం వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులందరినీ వెంటనే రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు.2022 నుంచి పెండింగ్‌లో ఉన్న 5 శాతం వార్షిక ఇంక్రిమెంట్‌తో పాటు 8 శాతం లాయల్టీ బోనస్‌ను తక్షణమే చెల్లించాలని, కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మెను మరింత ఉధృతంగా కొనసాగిస్తామని, ప్రభుత్వం స్పందించి ఉద్యోగులను రెగ్యులర్ చేసే వరకు సమ్మెను విరమించేది లేదని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు గంగాధర్, జిల్లా కోఆర్డినేటర్ రమణ, జేఏసీ నాయకులు డా. రమేష్, డా. అలీ, డా. శ్రీమంత్, డా. సన్నిత్, డా. రానా ప్రతాప్, డా. సంధ్యారాణి, వినీత, వంశీ, సుజాత, రాధ, శోభ, గంగమణి, జైపాల్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

చిల్లర కోసం గొడవ.. చివరకు మహిళా కండక్టర్ మృతి

హైదరాబాద్: చిల్లర విషయంలో ప్రయాణికురాలితో జరిగిన వివాదంలో తీవ్రంగా గాయపడిన మణుగూరు ఆర్టీసీ డిపో మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక (24) చికిత్స పొందుతూ మృతి చెందారు.గత నెల 25న మణుగూరు నుంచి భద్రాచలం వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ఈ ఘటన చోటుచేసుకుంది. తన కుమారుడి టికెట్ కోసం ప్రయాణికురాలు రూ.100 నోటు ఇవ్వగా, మిగతా చిల్లర విషయంలో కండక్టర్‌తో వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో ప్రయాణికురాలు ప్రవళికను కదులుతున్న బస్సు నుంచి తోసివేసినట్లు పోలీసుల ప్రాథమిక వివరాలు వెల్లడిస్తున్నాయి.రోడ్డుపై పడిన ప్రవళికపై బస్సు వెనుక చక్రాలు వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. పది రోజుల పాటు హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందిన ఆమె మంగళవారం రాత్రి తుదిశ్వాస విడిచారు.ప్రవళిక మృతిపై తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆర్టీసీ సిబ్బంది విధి నిర్వహణలో పొరపాటు చేస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని సూచించారు.ఈ ఘటనకు బాధ్యురాలిపై హత్య కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి పేర్కొన్నట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. ప్రవళిక కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, రూ.10 లక్షల పరిహారం, ఇందిరమ్మ ఇల్లు,
ఆమె తల్లికి ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు.చిల్లర విషయంలో మొదలైన చిన్న వివాదం.. ఓ యువతి ప్రాణాలను బలితీసుకోవడం తీవ్ర విషాదాన్ని నింపింది.

బాధిత కుటుంబాలను పరామర్శించిన బలరాం జాదవ్



(నేరడిగొండ, సాక్షర) :నేరడిగొండ మండలం సావర్గాం గ్రామానికి చెందిన సర్పంచ్ మహేందర్ మాతృమూర్తి చనిపోయారని తెలుసుకున్న రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.అలాగే ముందటి సావర్గాం గ్రామానికి చెందిన గులాబ్ సింగ్ చనిపోయారని వారి కుటుంబ సభ్యులను కూడా పరామర్శించడం జరిగింది.

అంతర్రాష్ట్ర చైన్ స్నాచింగ్ ముఠా అరెస్ట్

- 10 తులాల బంగారం, కారు, ఆటో స్వాధీనం

(ఆదిలాబాద్ ప్రతినిధి, సాక్షర): ఒంటరి మహిళలే టార్గెట్ గా నాలుగు రాష్ట్రాల్లో చైన్ స్నాచింగ్ లకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను ఆదిలాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ముగ్గురు మహిళలు సహా 8 మంది నిందితుల నుంచి 10 తులాల బంగారు ఆభరణాలు, కారు, ఆటో, 5 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ బుధవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు.నిందితులంతా
మహారాష్ట్రలోని వార్ధా ప్రాంతానికి చెందిన వారు. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో సంచరిస్తూ నేరాలకు పాల్పడుతున్నారు.నిందితులు కారు, ఆటోలో పట్టణాలకు చేరుకొని ఒంటరిగా వెళ్తున్న వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకునేవారు. ఆటోలో ఎక్కించుకొని మాటలతో నమ్మించేవారు. పక్కన కూర్చున్న మహిళా నిందితురాలు వాంతులు చేసుకుంటున్నట్లు నటిస్తూ బాధితురాలి దృష్టి మళ్లించేది. అదే సమయంలో మరో మహిళ బాధితురాలి మెడలోని గొలుసును నోటితో కొరికి తెంపి దొంగిలించేది. అనంతరం బాధితురాలిని దింపేసి పరారయ్యేవారు.నకిలీ నంబర్ ఉన్న ఆటోలో దొంగతనం చేసి కొద్ది దూరం వెళ్లి కారులోకి మారేవారు. దొంగిలించిన బంగారాన్ని కరిగించి ముక్కలుగా చేసి కొద్దికొద్దిగా విక్రయిస్తూ వచ్చిన డబ్బుతో జల్సాలకు పాల్పడేవారు.వారం రోజుల క్రితం ఆదిలాబాద్ పట్టణంలో ఒక మహిళ మెడలోని గొలుసును దొంగిలించారు. 2025 శ్రీరామ నవమి వేడుకల్లో, జాతీయ రహదారి పక్కన ఉన్న రామాలయంలో భోజనాల సమయంలోనూ మహిళల గొలుసులను దొంగిలించారు.31.10.2026న నిర్మల్ పట్టణంలో ఇద్దరు మహిళల గొలుసులను దొంగిలించి ముఠాలోని ఇద్దరికి భద్రపరిచారు. మరిన్ని నేరాలకు ఆదిలాబాద్ కు వస్తుండగా పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించగా పట్టుకున్నారు. విచారణలో నేరాలు అంగీకరించారు.ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో 6 కేసులు నమోదయ్యాయి. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్ణాటకలోనూ పలు కేసులు ఉన్నట్లు తేలింది. నిందితులు 1. విశాల్ సావంత్ పాత్రే (44), వార్ధా, 2. అల్లా రహీమ్ (22), వార్ధా , 3. సంజయ్ @ ఎల్.బి. సయ్యద్ (38), వార్ధా, 4. లొండే విశ్వదీప్ (40), వార్ధా, 5. షైక్ ఫెరోజ్ (45), వార్ధా, 6. రంజిత పాత్రే (46), వార్ధా, 7. లక్ష్మీ అజిత్ బోకర్ (30), వార్ధా, 8. నాడే నిషా (25), వార్ధా అరెస్ట్ అయ్యారు.ఉచిత లిఫ్ట్ ఇస్తామంటూ ఆటోలో ఎక్కించుకునే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలను గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు.కేసు చేధనలో కృషి చేసిన సిబ్బందిని ఎస్పీ అభినందించి నగదు రివార్డులు ప్రకటించారు.సమావేశంలో డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి సునీల్ కుమార్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్సై ఎన్ నాగనాథ్, సైబర్ క్రైమ్ ఆర్ఎస్ఐ గోపికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

కామారెడ్డి వైద్య కళాశాలలో ర్యాగింగ్ ఘటన

- 14 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థుల సస్పెన్షన్
- ఎన్ఎంసికి ఫిర్యాదు చేసిన బాధిత విద్యార్థి

(నిజామాబాద్ ప్రతినిధి, సాక్షర): కామారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో ఇటీవల చోటు చేసుకున్న ర్యాగింగ్ ఘటన కలకలం రేపింది. ర్యాగింగ్ ఘటనలో ప్రమేయం ఉన్నారనే ఆరోపణలపై కామారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల అధికారులు 14 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులను సస్పెండ్ చేశారు.విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఇటీవల దసరా సెలవుల తర్వాత కృష్ణ మందిర్‌లోని ప్రథమ సంవత్సరం విద్యార్థుల హాస్టల్‌లోకి పలువురు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రవేశించి, కొత్తగా చేరిన వైద్య విద్యార్థులను ర్యాగింగ్‌కు గురిచేశారు. హాస్టల్ ప్రాంగణంలోకి బలవంతంగా ప్రవేశించడం ఈ ఘటనలో భాగమని సమాచారం.ఈ విషయమై బాధితుల్లో ఒక విద్యార్థి జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసి)కి ఫిర్యాదు చేయగా, ఎన్ఎంసి ఈ ఘటనను తీవ్రంగా పరిగణించి, స్థానిక పోలీసులను, కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయాన్ని అప్రమత్తం చేసింది.ఈ ఘటన అనంతరం, కళాశాల అధికారులు పలు సమావేశాలు నిర్వహించి, జిల్లా కలెక్టర్, పోలీసు అధికారులతో కలిసి విషయంపై చర్చించారు. పోలీసులు క్యాంపస్‌లో ర్యాగింగ్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు.అంతర్గత విచారణలో, ఈ ఘటనలో ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 14 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులను కళాశాల అధికారులు గుర్తించి, వారిని సస్పెండ్ చేశారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వాల్యా తెలిపిన సమాచారం మేరకు ఆ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు హాస్టల్ బయట నివసిస్తున్నారని, వారు ప్రథమ సంవత్సరం హాస్టల్ ప్రాంగణంలోకి ప్రవేశించారని ఆరోపణలు ఉన్నాయని తెలిపారు.ఈ ఘటనలో 14 మంది విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారని కళాశాల విచారణ కమిటీ కనుగొంది. ఈ ఘటనలో ప్రత్యక్షంగా పాల్గొన్న వారిని ఆరు నెలల పాటు సస్పెండ్ చేయగా, ఇతర విద్యార్థులను కూడా అదే కాలానికి తరగతులకు హాజరు కాకుండా నిషేధించినట్లు ఆయన చెప్పారు.హాస్టళ్లలోనే నివసిస్తున్న తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఈ ఘటనతో ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. ర్యాగింగ్‌ను నివారించడానికి కళాశాల కఠిన చర్యలు తీసుకుంటోందని, క్యాంపస్‌లో ర్యాగింగ్ వ్యతిరేక కమిటీలు చురుకుగా పనిచేస్తున్నాయని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు.

చింతగూడెం వద్ద రైతుల అందోళన

మంచిర్యాల: కడెం ప్రాజెక్టు నుండి సాగునీటిని అధికారులు నిలిపివేయడంతో రైతులు రోడెక్కారు. జన్నారం మండలం చింతగూడెం వద్ద జాతీయ రహదారిపై ధర్నాకు రైతన్నలు దిగారు. వెంటనే నీటిని విడుదల చేసి వరి పంటను కాపాడాలని డిమాండ్ చేసారు. దాంతో ఇరువైపులా భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ప్రాజెక్టులో ప్రస్తుతం ఉన్న నీటిని తాగునీటి కోసం వినియోగించాలని అధికారులు సాగునీటిని నిలిపివేసారు.

ఆర్టీసీలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.లక్ష మోసం

- నిందితుడి అరెస్ట్, రిమాండ్

(మావల, సాక్షర): ఉద్యోగం పేరుతో నమ్మించి డబ్బులు తీసుకొని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు మావల ఎస్.హెచ్.ఓ బి.డి. ప్రేమ్ కుమార్ తెలిపారు.నిందితుడి వివరాలు ఇలా ఉన్నాయి.గవాండే గజానంద్ (37), తండ్రి గవాండే శ్యామ్ రావు, కులం మరాఠా, వృత్తి ఆర్టీసీ శాఖలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి, నివాసం హనుమాన్ నగర్, ఇంద్రవెల్లి, ఆదిలాబాద్ జిల్లా వాసి.ఆదిలాబాద్ పట్టణంలోని కైలాష్ నగర్‌కు చెందిన కె. పవన్ కళ్యాణ్ (28)కు నిందితుడు గవాండే గజానంద్ గతంలో అద్దెకు పక్కింట్లో ఉండటం ద్వారా పరిచయం ఏర్పడింది. 2021 నుంచి 2024 మధ్య ఆర్టీసీ కార్గోలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి, విడతలవారీగా ఫోన్ పే ద్వారా రూ.60,000, నగదు రూపంలో రూ.40,000 కలిపి మొత్తం రూ.1,00,000 తీసుకున్నాడు.డబ్బులు తీసుకున్న అనంతరం ఉద్యోగం ఇప్పించకుండా, తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకుండా బాధితుడిని మోసం చేశాడు. డబ్బులు తిరిగి ఇవ్వాలని పలుమార్లు కోరినప్పటికీ రేపు, ఎల్లుండి అంటూ కాలయాపన చేశాడు.డబ్బులు అడిగేందుకు ఇంద్రవెల్లిలోని నిందితుడి ఇంటికి వెళ్లిన బాధితుడిని నిందితుడు, అతని భార్య బెదిరించడంతో బాధితుడు భయపడి వెనుదిరిగాడు.చివరకు బాధితుడి ఫిర్యాదు మేరకు మావల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని తెలిపారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే వ్యక్తులను నమ్మి ముందస్తుగా డబ్బులు చెల్లించవద్దు. ఉద్యోగ నియామకాలు అధికారిక ప్రక్రియ ద్వారా మాత్రమే జరుగుతాయని గుర్తించాలి. ఎవరైనా ఉద్యోగం పేరుతో డబ్బులు తీసుకొని మోసం చేస్తే వెంటనే పోలీసులను ఆశ్రయించాలి.

ఉపాధ్యాయులకు టీజీటీఈటీ సిబిటి మాక్ టెస్ట్ ప్రాక్టీస్‌కు అవకాశం

- జిల్లా విద్యాశాఖ అధికారి

(నిర్మల్ ప్రతినిధి, సాక్షర): నిర్మల్ జిల్లాలో టీజీటీఈటీ 2026-II పరీక్షకు దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల సౌకర్యార్థం కంప్యూటర్ ఆధారిత పరీక్ష (CBT) విధానంపై అవగాహన, ప్రాక్టీస్ కల్పించేందుకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో 2026 నవంబర్ 5 నుండి 10 వరకు మాక్ టెస్ట్ నిర్వహించనున్నారు.ఈ మాక్ టెస్ట్ కోసం జిల్లాలో ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ హై స్కూల్ కడెం, లక్ష్మణ్ చందా, జుమ్మేరాత్ పేట్, కుంటాల, బాసర - ఈ ఐదు కేంద్రాలలో ఏదైనా ఒక కేంద్రాన్ని సందర్శించి మాక్ టెస్ట్ రాసుకోవచ్చు.ఈ మాక్ టెస్ట్ https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది.కంప్యూటర్ ఆధారిత పరీక్షా విధానంపై పూర్తి అవగాహన పొందడానికి, కంప్యూటర్ వినియోగంలో ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేసుకోవడానికి, అసలు పరీక్షకు ముందుగానే తగిన ప్రాక్టీస్ పొందడానికి ఇది ఒక మంచి అవకాశం. కావున అర్హులైన ఉపాధ్యాయులందరూ ఈ అవకాశాన్ని తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి. భోజన్న సూచించారు.ఈ మాక్ టెస్ట్‌కు హాజరయ్యే ఉపాధ్యాయులకు ఎలాంటి ఓడి సౌకర్యం కల్పించబడదు. కావున ఉపాధ్యాయులు ఈ విషయాన్ని గమనించి, తమ వ్యక్తిగత సౌలభ్యం మేరకు మాక్ టెస్ట్‌కు హాజరుకావాలని సూచించారు.ఉపాధ్యాయులు తమకు కేటాయించిన కేంద్రాల వద్ద అందుబాటులో ఉన్న కంప్యూటర్, ఇంటర్నెట్ సౌకర్యాలను వినియోగించుకోవచ్చని తెలిపారు.

నేడు నగరంలో నీటి సరఫరా నిలిపివేత

- పైపులైన్ మరమ్మతులతో పలు ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం

(నిజామాబాద్ ప్రతినిధి, సాక్షర): అలీ సాగర్ ఫీడర్ పైపులైన్‌కు సంబంధించి రైల్వే కమాన్ వద్ద 500 ఎంఎం డయా ఎంఎస్ పైపులైన్ మరమ్మతు పనులు చేపడుతున్న నేపథ్యంలో ఈనెల 5న నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం కలగనుంది. ఈ మేరకు నిజామాబాద్ నగరపాలక సంస్థ అధికారులు ప్రజలకు సమాచారం అందించారు.మరమ్మతు పనుల కారణంగా నాందేవాడ, అమలవాడి, సుభాష్‌నగర్, ఆదర్శనగర్, గౌతమ్‌నగర్, దుబ్బ, ఖిల్లీ వాడి, ఎల్లమ్మగుట్ట, కంటేశ్వర్, చంద్రశేఖర్ కాలనీ, గంగాస్థాన్, ఇస్లాంపుర కాలనీ, అశోక్‌నగర్, వినాయకనగర్ ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది.పైపులైన్ మరమ్మతు పనులకు ప్రజలు సహకరించాలని కోరారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలి

- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్



(ఉట్నూర్, సాక్షర): జిల్లాలో అమరజీవి కుంరం సూరు 29వ వర్ధంతి వేడుకలను ఐటీడీఏ ఆధ్వర్యంలో బుధవారం ఉట్నూర్ మండలం కొలం గూడ గ్రామంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్, ఎంపీ గోడం నగేష్, జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఐటీడీఏ పీవో మంద మకరందు, సబ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు కుంరం సూరు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ.. గిరిజనులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపాలని పిలుపునిచ్చారు. భూ సమస్యలు, అటవీ హక్కుల గుర్తింపునకు సంబంధించి కోర్ ఏరియాలు, భూమి కేటాయింపులు, అటవీ ప్రాంత హక్కులపై అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి తగిన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ, ఫారెస్ట్, ట్రైబల్ వెల్ఫేర్ శాఖల అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి గిరిజన బిడ్డలకు సకాలంలో న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. గిరిజనులు తమకు లభించిన చట్టపరమైన హక్కులను, కోర్టుల ద్వారా లభించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ.. ఆదిలాబాద్ జిల్లాలో కొలమ్ జాతికి చెందిన సుమారు 7,000 కుటుంబాలు ఉన్నాయని, 9 శాఖల ద్వారా పీఎం జన్మన్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి గిరిజనుడికి అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఇండ్ల నిర్మాణాలు, పోడు భూముల సమస్యలు, అలాగే ఆర్‌వోఎఫ్‌ఆర్ చట్టంలోని కొలమ్, నివాసం, కమ్యూనిటీ అనే మూడు రకాల హక్కులపై ప్రత్యేక దృష్టి సారించామని, త్వరలోనే అర్హులైన వారికి తగిన ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. గిరిజనులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా కేంద్రంలో ప్రత్యేక ఆధార్ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, విద్యార్థులు విద్య, ఉద్యోగ రంగాల్లో మరింత ముందుకు రావాలని ఆకాంక్షించారు.ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ.. మహనీయుల ఆశయాలను అనుసరించాలని, వాటిని భావితరాలకు అందజేసే బాధ్యత మనందరిపై ఉందన్నారు. యువత చెడు వ్యసనాల బారిన పడకుండా చదువుపై శ్రద్ధ వహించి ఉన్నతంక స్థిరపడాలని సూచించారు. ఐటీడీఏ పీవో మంద మకరందు మాట్లాడుతూ, ఐటీడీఏ ద్వారా అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధి కూలీలకు రావలసిన బకాయిల కోసం సంబంధిత అధికారులతో మాట్లాడటం జరిగిందని, త్వరలోనే బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలో ఉపాధి పనుల దినాలు తక్కువగా ఉన్నప్పటికీ ప్రస్తుతం మెరుగైన అవకాశాలు అందుబాటులో ఉన్నాయని, గ్రామాల్లో ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఐటీడీఏ అధికారులు, రెవెన్యూ, ఫారెస్ట్, ట్రైబల్ వెల్ఫేర్ శాఖల అధికారులు, సంఘ నాయకులు, కొలమ్ కుల బాంధవులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని వర్షాలు..

- పొంగిపొర్లుతున్న వాగులు..
- భద్రాద్రి జిల్లాలో జలమయమైన రహదారులు



సాక్షర,ములకలపల్లి, నవంబర్ 4: మురసు తుఫాన్ ప్రభావంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ప్రధాన రహదారులు జలమయమవ్వగా.. లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. పాల్వంచ నుంచి మాదారం మీదుగా అన్నపురెడ్డిపల్లి వెళ్లే ప్రధాన రహదారిపై సత్యంపేట గ్రామం వద్ద పాములేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వంతెనపై నుంచి వరద నీరు పొంగిపొర్లుతుండటంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు పాల్వంచ నుంచి దమ్మపేట వెళ్లే ప్రధాన రహదారిపై రాజుపేట శివారులో పాములేరు వాగుపై ఇటీవల కూలిన వంతెన పక్కన ఏర్పాటు చేసిన తాత్కాలిక అప్రోచ్ కూడా వరద ఉధృతికి కొట్టుకుపోయింది. దీంతో ఈ రెండు మార్గాల్లో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు భారీ వర్షాలతో మండలంలోని లోతట్టు ప్రాంతాల్లో సాగు చేస్తున్న వరి, మిర్చి, పుచ్చ, శనగ తదితర పంటలు నీట మునుగుతున్నాయి. ఇప్పటికే వర్షాలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు తాజా వర్షాలు మరింత నష్టం కలిగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు ఇలాగే కొనసాగితే పంటలు పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉందని ఆవేదన చెందుతున్నారు.

సిరికొండ నూతన ఎస్సైగా కే. రాజశేఖర్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

- గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలి



(సిరికొండ, సాక్షర): సిరికొండ పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా కే. రాజశేఖర్ రెడ్డి నియామకం కాగా, గతంలో సిరికొండ ఎస్సైగా పనిచేసిన విక్రమ్ మావల పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు.ఈ సందర్భంగా బుధవారం జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో నూతన ఎస్సై కే. రాజశేఖర్ రెడ్డి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేసి బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సిరికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలను పూర్తిస్థాయిలో అరికట్టాలని సూచించారు.గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక దృష్టి సారించాలని, మాదకద్రవ్యాల రహిత జిల్లాగా ఆదిలాబాద్‌ను తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని తెలిపారు.ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు నిరంతరం కృషి చేయాలని జిల్లా ఎస్పీ సూచించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా



(నార్నూర్, సాక్షర): విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. బుధవారం నార్నూర్ మండలం గంగాపూర్(జి) గ్రామంలో గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలోని విద్యార్థుల హాజరు శాతం, మౌలిక వసతులను పరిశీలించారు. ఉపాధ్యాయులతో మాట్లాడి బోధనా ప్రమాణాలు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యంపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించి నిర్దేశించిన మెనూ ప్రకారం ఆహారం అందించాలన్నారు. పాఠశాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి సూచించారు. విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలను కలెక్టర్ పరిశీలించి అభినందించారు. అదేవిధంగా పాఠశాల ఆవరణలోని బోర్ వద్ద ఇంకుడు గుంత నిర్మించాలని ఆదేశించారు. అంతకుముందు గ్రామస్థులు పాఠశాల ఆవరణలో ప్రహరీగోడ నిర్మించాలని, నూతన అంగన్వాడీ భవనం మంజూరు చేయాలని కోరగా, ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రక్రియలో ఉట్నూర్ సబ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్, తహసిల్దార్ రాజలింగు, ఎంపిడిఓ పుల్లయ్య, ఉపాధ్యాయురాలు శోభా, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రైతు గర్జన విజయవంతం..

(ఆదిలాబాద్ ప్రతినిధి, సాక్షర): ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రైతుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు గర్జన కార్యక్రమం విజయవంతం కావడంతో మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు జోగు రామన్న, భార్గవ్ దేశ్పాండే, యువ నాయకుడు జోగు మహేందర్‌లు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి రైతు గర్జన విజయవంతమైన విషయాన్ని వివరించి అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ.. కేసీఆర్, కేటీఆర్‌ల స్ఫూర్తివంతమైన నాయకత్వంలో గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అనేక సంక్షేమ పథకాల ద్వారా రైతాంగానికి అండగా నిలిచామని పేర్కొన్నారు. రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్, సాగునీటి సౌకర్యాలు వంటి పథకాలతో రైతుల ఆర్థిక, వ్యవసాయ అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతుబంధు, రైతుబీమా అమలులో జాప్యం, వ్యవసాయ అవసరాలకు తగిన ప్రోత్సాహం లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలనే సంకల్పంతోనే రైతు గర్జన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు.రైతు గర్జనకు జిల్లా నలుమూలల నుంచి రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ ఐక్యతను చాటడంతో పాటు గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనపై తమకున్న అభిమానాన్ని, నమ్మకాన్ని మరోసారి వ్యక్తం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా రైతాంగం ఐక్యమత్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసిందన్నారు. రానున్న రోజుల్లో రైతాంగ సంక్షేమం కోసం కేసీఆర్ నాయకత్వం మళ్లీ రావాలని రైతులు ఆకాంక్షిస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వ స్వార్థపూరిత రాజకీయాలకు చరమగీతం పాడేందుకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై ఉన్నారని జోగు రామన్న పేర్కొన్నారు.

గోదావరి పుష్కరాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర): రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. పుష్కరాల నాటికి అన్ని అభివృద్ధి, నిర్మాణ పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.బుధవారం బాసరలోని ఆలయ ఈవో కార్యాలయంలో పుష్కరాల ఏర్పాట్లు, సరస్వతీ అమ్మవారి ఆలయ నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.పుష్కర ఘాట్ల మరమ్మతులు, నూతన ఘాట్ల నిర్మాణం, మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు, పిండ ప్రదాన ప్రాంతం, పోలీస్ కమాండ్ కంట్రోల్ కేంద్రం, భక్తుల పార్కింగ్, వీఐపీ పార్కింగ్ తదితర పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.భక్తుల రద్దీకి అనుగుణంగా అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, పుష్కరాలకు వచ్చే ప్రముఖుల వసతికి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రతి పనికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.అనంతరం సరస్వతీ అమ్మవారి ఆలయ నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించిన కలెక్టర్, పనుల్లో జాప్యం లేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.పుష్కరాల ఏర్పాట్లు, ఆలయ నిర్మాణ పనులను సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో ఆర్ అండ్ బీ ఈఈ సుభాష్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, ఆలయ ఈవో అంజనా దేవి, తహసీల్దార్ పవన్ చంద్ర, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐతో మోసాల్లో రియల్



హైదరాబాద్: ప్రస్తుత డిజిటల్ యుగంలో సోషల్ మీడియా ప్రభావం సామాన్యుల జీవితాలపై ఏ స్థాయిలో ఉందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ముఖ్యంగా ఇన్‌ఫ్లుయెన్సర్లు, ప్రముఖ యూట్యూబ్ ఛానెళ్లు చెప్పేమాటలను ప్రజలు గుడ్డిగా నమ్మేస్తున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న కొందరు కేటుగాళ్లు రియల్ ఎస్టేట్ రంగంలో సరికొత్త మోసాలకు తెరలేపారు. ఎలాంటి మౌలిక వసతులు, చట్టపరమైన లీగల్ క్లియరెన్సులు లేని బోగస్ వెంచర్లను కూడా సోషల్ మీడియా వేదికగా బ్రహ్మాండమైన ప్రాజెక్ట్‌లుగా అభివర్ణిస్తూ అమాయకులను పెద్ద ఎత్తున మోసగిస్తున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి.ఈ మోసాలవెనుక పెద్ద తంతే నడుస్తోంది. మార్కెట్లో ఎలాంటి గుర్తింపు లేని లేదా వివాదాస్పదంగా ఉన్న వెంచర్ల యజమానులు సోషల్ మీడియాలో విపరీతమైన ఫాలోయింగ్ ఉన్న ఇన్‌ఫ్లుయెన్సర్లను భారీ మొత్తంలో డబ్బులిచ్చి ప్రచారం చేయించుకుంటున్నారు. ఆయా ఛానెళ్ల హోస్ట్‌లు తాము స్వయంగా ఆ ప్రాజెక్ట్‌ను పరిశీలించినట్లు, భవిష్యత్తులో కోట్లలో లాభాలు వస్తాయని అతిశయోక్తులతో కూడిన ప్రమోషనల్ వీడియోలను రూపొందించి సోషల్ మీడియాలో వదులుతారు. ఆ మాయ మాటలను నమ్మి సామాన్యులు, ఎన్ఆర్ఐలు తమ కష్టపడిన సంపాదనను ఆ వెంచర్లలో గుడ్డిగా పెట్టుబడి పెట్టి నిలువునా మోసపోతున్నారు.క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఆ వెంచర్లకు హెచ్ఎండీఏ లేదా జీడీఏ అనుమతులు ఉండవు సరికదా, కనీసం కరెంటు, రోడ్లు, తాగునీరు వంటి కనీస మౌలిక వసతులు కూడా ఉండవు.కొన్నిసార్లు భూములు ప్రభుత్వ లేదా అసైన్డ్ భూముల వివాదాల్లో ఉంటాయి. అయినప్పటికీ ఇన్‌ఫ్లుయెన్సర్లు సృష్టించే కృత్రిమ హైప్ కారణంగా కొనుగోలుదారులు అసలు నిజాలు తెలుసుకోలేకపోతున్నారు.రిజిస్ట్రేషన్ సమయంలో అసలు విషయం బయటపడేసరికి బాధితులు లబోదిబోమంటూ లాయర్లు, పోలీసులను ఆశ్రయించాల్సిన దుస్థితి తలెత్తుతోంది.అందువల్ల సోషల్ మీడియాలో వచ్చే అందమైన ప్రకటనలు, ఇన్‌ఫ్లుయెన్సర్ల ప్రమోషన్లను చూసి ఏమాత్రం ఆకర్షితులు కావద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏదైనా రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్‌లో పెట్టుబడి పెట్టే ముందు లేదా ప్లాట్లు కొనే ముందు.. ఆ సంస్థకు రెరా రిజిస్ట్రేషన్ ఉందా లేదా?, సంబంధిత ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు వచ్చాయా లేదా అని స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించుకోవడం అత్యంత కీలకమని స్పష్టం చేస్తున్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తా: సర్పంచ్ పోరండ్ల సంతోష్

(తలమడుగు, సాక్షర): దేవాపూర్ గ్రామంలోని ఆలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని దేవాపూర్ గ్రామ సర్పంచ్ పోరండ్ల సంతోష్ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మికతతో పాటు సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడుకోవడంలో దేవాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. గ్రామ ప్రజల సహకారంతో ఆలయాలను అభివృద్ధి చేసి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బుధవారం దేవాపూర్ గ్రామంలోని గ్రామ దేవతల పొచ్చమ్మ ఆలయ ప్రాంగణంలో స్థానికులతో కలిసి సర్పంచ్ పోరండ్ల సంతోష్ అభివృద్ధి పనులకు భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సర్పంచ్‌కు తమ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పోరండ్ల సంతోష్ మాట్లాడుతూ.. గ్రామ దేవతల ఆలయాలకు గ్రామ ప్రజల జీవితాల్లో ప్రత్యేక స్థానం ఉంటుందని అన్నారు. పండుగలు, జాతరలు, ప్రత్యేక పూజల సమయంలో గ్రామస్తులంతా ఒకచోట చేరి భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. ఇలాంటి ఆధ్యాత్మిక కేంద్రాలు గ్రామ ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించడంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజల విశ్వాసాలకు, అవసరాలకు అనుగుణంగా ఆలయాల అభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇస్తానని సంతోష్ తెలిపారు. గ్రామస్తుల అభిప్రాయాలను తెలుసుకుంటూ, అందరి భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. ఆలయాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, భక్తులకు అనుకూలమైన వాతావరణం కల్పించడం వంటి అంశాలపై కూడా దృష్టి సారిస్తానని వివరించారు. గ్రామ అభివృద్ధి అనేది కేవలం రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలకే పరిమితం కాదని, గ్రామ ప్రజల ఆధ్యాత్మిక, సామాజిక అవసరాలను గుర్తించి వాటిని నెరవేర్చడం కూడా ముఖ్యమని స్థానికులు అభిప్రాయపడ్డారు. గ్రామ దేవతల ఆలయాల అభివృద్ధి పనులు ప్రారంభం కావడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. గ్రామ ప్రజల సహకారం, ఐక్యతతో దేవాపూర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని సర్పంచ్ స్పష్టం చేశారు. ప్రారంభించిన పనులను నాణ్యతతో, సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ఎకరానికి లక్ష రూపాయలు ఇవ్వాలి

- సీపీఐ ఆధ్వర్యంలో కరువు పరిశీలన
- రచ్చబండలో రైతుల డిమాండ్

(ఆదిలాబాద్ , సాక్షర): సిపిఐ ఆధ్వర్యంలో కరువు పరిశీలన కొరకు సిపిఐ బృందం బయలుదేరి పంటలను పరిశీలించి పలు గ్రామాల ప్రజలతో రచ్చబండ సమావేశాలు నిర్వహించారు.ఎకరానికి కరువు నివారణ కొరకు ఎంత ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర సభ్యులు ముడుపు ప్రభాకర్ రెడ్డి ప్రజలను కోరగా, ఐదు ఎకరాల వరకు భూమి ఉన్నవారికి ఎకరానికి లక్ష రూపాయలు ఇవ్వాలని, ఐదు ఎకరాల పైగా ఉన్న వారికి 60 వేల చొప్పున ఇవ్వాలని ప్రజలు రచ్చబండలో చెప్పడం జరిగిందని తెలిపారు.ఇదే విషయం జిల్లా అధికార యంత్రంతో, కలెక్టర్ తో కలిసి ప్రభుత్వానికి పంపిస్తామని, ఆ తర్వాత సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో ఉద్యమాలు చేయడానికి కూడా సిద్ధమని, కరువు నివారణ చర్యలు వచ్చేవరకు పోరాడుతామని ప్రజలకు భరోసా ఇచ్చారు.బూరాజ్ మండలంలో గిమ్మ తోపాటు దాదాపు పది గ్రామాల్లో పర్యటించి రైతులతో ముచ్చటించడం జరిగింది. కరువు నివారణ చర్యల కొరకు పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కరువు డిక్లేర్ చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం చోద్యం చూస్తున్నదని, వెంటనే నరేంద్ర మోదీ బిజెపి ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించి, ఇది జాతీయ విపత్తు కాబట్టి కేంద్రం నుంచి కూడా పెద్ద ఎత్తున నిధులు ఆదిలాబాద్ జిల్లాకు రావాలని, ఆదివాసి జిల్లాలను ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర సభ్యులు ముడుపు ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు సిపిఐ సీనియర్ నాయకులు కుంటాల రాములు, షేక్ పాషా, బి కే ఎం యు జిల్లా అధ్యక్షులు ఖండాల గణేష్, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు కొడప సురేష్, సిపిఐ నాయకులు షేక్ సలీం, రైతులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో భారీ నకిలీ కరెన్సీ ముఠా గుట్టురట్టు

- రూ.6.78 కోట్ల నకిలీ నోట్లు స్వాధీనం..
- నలుగురి అరెస్టు



హైదరాబాద్: నగరంలో భారీ నకిలీ కరెన్సీ ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఏకంగా రూ.6.78 కోట్ల విలువైన నకిలీ నోట్లను స్వాధీనం చేసుకుని, ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న నలుగురిని అరెస్టు చేశారు.మడుపోజు కర్ణాకర్, చిన్నోళ్ల మాణిక్య రెడ్డి, చెరుకుపెల్లి రత్నాకర్ రెడ్డి, కరణ అజయ్ కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.500 నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాకు చెందిన మరో ముగ్గురు పరారీలో ఉండటంతో వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. నవంబర్ 1న అందిన పక్కా సమాచారంతో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. రామోజీ ఫిల్మ్ సిటీ సమీపంలో అనుమానాస్పదంగా కనిపించిన కారును ఆపి తనిఖీ చేయగా, అందులో రూ.8 లక్షల విలువైన నకిలీ నోట్లు బయటపడ్డాయి. కారులో నకిలీ పోలీసు గుర్తింపు కార్డులు, బొమ్మ తుపాకీ,హ్యాండ్‌గన్‌లు, నాలుగు మొబైల్ ఫోన్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను విచారించగా హైదరాబాద్ సమీపంలోని కుంట్లూరులో నకిలీ నోట్ల తయారీ కేంద్రం నిర్వహిస్తున్నట్లు వెల్లడైంది. దీంతో అక్కడ తనిఖీలు చేపట్టిన పోలీసులు మరో రూ.6.70 కోట్ల విలువైన నకిలీ నోట్లను గుర్తించారు. నోట్ల తయారీకి ఉపయోగిస్తున్న ప్రింటర్లు, ల్యాప్‌టాప్, లామినేషన్ మెషీన్, పేపర్ కటింగ్
మెషీన్ తదితర పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో ఈ ముఠా నకిలీ నోట్ల తయారీ కోసం యూట్యూబ్ వీడియోలు, సోషల్ మీడియాను ఆశ్రయించినట్లు వెల్లడైంది. అసలు నోట్లను స్కాన్ చేసి, కంప్యూటర్‌లో మార్పులు చేసి నకిలీ నోట్లను ముద్రించినట్లు పోలీసులు గుర్తించారు. మొదట నకిలీ నోట్లను నేరుగా మార్కెట్లో చలామణి చేసేందుకు ప్రయత్నించినప్పటికీ విఫలమయ్యారు. దీంతో ప్రజలను మోసం చేసేందుకు కొత్త పద్ధతిని ఎంచుకున్నారు. తక్కువ ధరకు ఎక్కువ మొత్తంలో నకిలీ నోట్లు ఇస్తామని ఆశ చూపుతూ వ్యక్తులను సంప్రదించేవారు. నమ్మకం కలిగించేందుకు మొదట అసలు నోట్లను చూపించి, ఆ తర్వాత డబ్బులు తీసుకుని మోసానికి పాల్పడేవారు. ఈ మోసాలకు పోలీసుల పేరును కూడా ఉపయోగించుకున్నారు. నకిలీ నంబర్ ప్లేట్లు ఉన్న వాహనాల్లో తిరుగుతూ, తాము పోలీసు అధికారులమని నమ్మించేందుకు నకిలీ గుర్తింపు కార్డులు, మైక్రోఫోన్లు, బొమ్మ తుపాకులను వినియోగించేవారు. నకిలీ నోట్లు కొనుగోలు చేసేందుకు వచ్చిన వారిని పోలీసులమంటూ బెదిరించి, వారి వద్ద ఉన్న డబ్బును దోచుకుని పరారయ్యేవారు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు, షాద్‌నగర్ స్పెషల్ ఆపరేషన్స్ బృందం సంయుక్తంగా ఈ ముఠాను పట్టుకున్నాయి. పరారీలో ఉన్న మరో ముగ్గురి కోసం గాలింపు కొనసాగుతోందని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి వెల్లడించారు. ఈ నకిలీ కరెన్సీ తయారీ, మోసాల వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా అనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.



ఎస్‌డబ్ల్యూసీ గోదాంలో కలెక్టర్, ఎస్పీ తనిఖీలు..

సాక్షర,కోదాడ: గోదాంలలో బియ్యం నిల్వ, నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయొద్దని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కోదాడ సమీపంలోని బాలాజీనగర్ ఎస్‌డబ్ల్యూసీ గోదాను జిల్లా కలెక్టర్, ఎస్పీ కె. నరసింహ సందర్శించి తనిఖీలు నిర్వహించారు. గోదాంలోని బియ్యం నిల్వలను, నిర్వహణ తీరును పరిశీలించారు. స్టాక్ రికార్డులను తనిఖీ చేయడంతో పాటు బియ్యం శాంపిల్స్ సేకరించి నాణ్యత పరీక్షలు చేయించారు. పరీక్ష ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదలకు పంపిణీ చేసే సన్న బియ్యాన్ని జాగ్రత్తగా నిల్వ చేయాలని సూచించారు. బియ్యం నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని గోదాం మేనేజర్, టెక్నికల్ అసిస్టెంట్లకు స్పష్టం చేశారు. నిల్వ చేసే విధానం, భద్రతా ప్రమాణాలు, ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్ (ఎఫ్ఐఎఫ్ఓ) పద్ధతిని తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సూచించారు.
హమాలీలకు లేబర్ కార్డులు.అనంతరం గోదాంలో పనిచేస్తున్న హమాలీలతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. తమకు లేబర్ కార్డులు ఇప్పించాలని వారు కోరగా కలెక్టర్ వెంటనే స్పందించారు. సంబంధిత లేబర్ అధికారితో మాట్లాడి జిల్లాలోని ఆరు బఫర్ గోదాంలలో పనిచేస్తున్న హమాలీలందరికీ లేబర్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హమాలీల ఇతర సమస్యలను కూడా పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో హమాలీలు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఆర్డిఓ సూర్యనారాయణ, జిల్లా సివిల్ సప్లైస్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, తాసిల్దార్ సంతోష్ కిరణ్ ఎస్‌డబ్ల్యూసీ మేనేజర్ సందీప్, టెక్నికల్ అసిస్టెంట్లు భాస్కర్ రెడ్డి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా గుట్టురట్టు

(నిజామాబాద్, ప్రతినిధి, సాక్షర): పగటిపూట తాళం వేసిన ఇళ్లే టార్గెట్ చేసి వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్ - రూ. లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, కారు, నకిలీ నెంబర్ ప్లేట్స్, దొంగతనం చేయుటకు ఉపయోగించే ఇనుప రాడ్లు స్వాధీనం చేసుకున్నట్లు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐపీఎస్ వెల్లడించారు.బుధవారం కమిషనరేట్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సీపీ నిందితుల వివరాలు తెలిపారు. ఏ1 సయ్యద్ షకీల్, తండ్రి సయ్యద్ యూసుఫ్(46) వార్డ్ నెంబర్ 05, జవహర్ నగర్, బుల్డాన జిల్లా, మహారాష్ట్ర. ఈయన ముఠా ప్రధాన సూత్రధారి, గతంలో వరంగల్, నిర్మల్, యాదాద్రి భువనగిరి జిల్లాలు, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లో దొంగతనాలు చేసి జైలుకు వెళ్లాడు. ఏ2 షేక్ అహ్మద్ ఆలియాస్ రాజు, తండ్రి షేక్ సమద్ (37) బుల్డానా గ్రామం, మహారాష్ట్ర, గతంలో వరంగల్, యాదాద్రి భువనగిరి జిల్లాలు, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లో దొంగతనాలు చేసి జైలుకు వెళ్లాడు. ఏ3 షేక్ ఇమ్రాన్, తండ్రి షేక్ మహబూబ్ (32) నివాసం: వార్డ్ నెంబర్ 5, జవహర్ నగర్, బుల్డాన జిల్లా, మహారాష్ట్ర. ఈ కేసును నిజామాబాద్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ బి. ప్రకాష్ యాదవ్ ఆధ్వర్యంలో టీంలుగా ఏర్పడి సి.హెచ్. శ్రీనివాస్ నార్త్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్, కే. శ్రీకాంత్ సబ్ ఇన్స్పెక్టర్ పీఎస్ నవీపేట్, సీసీఎస్ టీం నుండి ఏసీపీ పి. శ్రీశైలం, సీఐ అజయ్ కుమార్, పి సివసీం, హెచ్‌సీ స్వామి గౌడ్, కానిస్టేబుల్ రాజారెడ్డి, రాకేశ్, నీలేష్, సందీప్, సంగేష్, సీడీఆర్ సెల్ టీం సాగర్, శ్రీనివాస్, ఇతర సిబ్బందిని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐపీఎస్ అభినందించారు.

బండి సంజయ్‌కు మతిభ్రమించింది



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర): కేంద్ర మంత్రి హోదాలో ఉండి బాధ్యతాయుతంగా మాట్లాడాల్సిన బండి సంజయ్ బజారు భాషతో రాజకీయ దిగజారుడుతనాన్ని ప్రదర్శిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంబడి రాజేశ్వర్ తీవ్రస్థాయిలో విమర్శించారు.నిర్మల్‌లో నిర్వహించిన బీజేపీ మహా పాదయాత్ర ముగింపు సభలో బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై ఆయన ఘాటుగా స్పందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ పార్టీ శ్రేణులపై కేంద్ర మంత్రి ఉపయోగించిన పదజాలం ఆయన అసహనానికి, సంస్కారహీనతకు నిదర్శనమని మండిపడ్డారు.హైదరాబాద్‌లో జరిగిన సభలో నాయకుల మధ్య చోటుచేసుకున్న తొక్కిసలాటలో బండి సంజయ్ పరుగులు తీయడాన్ని ప్రస్తావిస్తూ, ఆ ఘటన నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కాంగ్రెస్ సోషల్ మీడియా కార్యకర్తలను ఉద్దేశించి బెదిరింపు వ్యాఖ్యలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు.ఓట్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో పేదలు, బడుగు బలహీన వర్గాలు, మైనారిటీల ఓటు హక్కులకు నష్టం కలిగించే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ ప్రశ్నిస్తోందని, దీనిపై బీజేపీ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.
దివంగత నేతలు పీవీ నరసింహారావు, ఎంఎస్ఆర్ పేర్లను రాజకీయ వివాదాల్లోకి లాగుతూ ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేయడం సరికాదని రాజేశ్వర్ అన్నారు.దేశ సమగ్రత, భద్రత కోసం సేవలందించిన నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీల త్యాగాల చరిత్ర కలిగిన గాంధీ కుటుంబాన్ని, రాహుల్ గాంధీని విమర్శించే నైతిక హక్కు బండి సంజయ్‌కు లేదని పేర్కొన్నారు.తెలంగాణలో ప్రజా పాలన ద్వారా రైతులు, మహిళలు, యువత సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రావణుడితో పోల్చడం బండి సంజయ్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. మత విద్వేషాలు, విభజన రాజకీయాలతో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్న బీజేపీ నేతలే ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు.నిర్మల్ జిల్లా సర్వమత సామరస్యానికి ప్రతీక అని, మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నాలను ఇక్కడి ప్రజలు సహించబోరని ఎంబడి రాజేశ్వర్ స్పష్టం చేశారు.కేంద్ర మంత్రి హోదాలో ఉన్నప్పటికీ నిర్మల్ జిల్లాకు, తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం నుంచి ఆశించిన స్థాయిలో నిధులు తీసుకురావడంలో బండి సంజయ్ విఫలమయ్యారని విమర్శించారు. అధికారం ఉందనే అహంకారంతో ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేస్తే తెలంగాణ ప్రజలే బీజేపీకి తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తతే అసలైన రక్షణ



- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
- వయోవృద్ధులు సైబర్ మోసాల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలి
- ప్రతి నెల మొదటి బుధవారం సైబర్ జాగ్రత్త దివాస్
- వయోవృద్ధులకు సైబర్ నేరాలపై అవగాహన

(ఆదిలాబాద్, సాక్షర): నేటి ఆధునిక సాంకేతిక యుగంలో సైబర్ నేరగాళ్లు రోజురోజుకు కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ తమ వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని భద్రంగా ఉంచుకోవాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ సూచించారు. ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహించే సైబర్ జాగ్రత్త దివాస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని ప్రణామం కేంద్రంలో వయోవృద్ధులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాల నివారణకు సంబంధించిన అవగాహన పోస్టర్లను ఎస్పీ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, ఆన్‌లైన్ షాపింగ్, యూపీఐ, నెట్ బ్యాంకింగ్ వినియోగించే సమయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా సైబర్ నేరగాళ్ల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. తెలియని లింకులు, నకిలీ వెబ్‌సైట్లు, ఫేక్ యాప్‌లు, ఆకర్షణీయమైన ఆఫర్లు, మోసపూరిత ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా వయోవృద్ధులు తమకు వచ్చే ఫోన్ కాల్స్, సందేశాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, బ్యాంకు అధికారులమని లేదా ఇతర సంస్థల ప్రతినిధులమని చెప్పి ఫోన్ చేసే వ్యక్తులకు బ్యాంకు వివరాలు, ఓటీపీ, ఏటీఎం పిన్, పాస్‌వర్డ్‌లు ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించవద్దని తెలిపారు. ఆన్‌లైన్ షాపింగ్ సమయంలో తక్కువ ధరలు, భారీ డిస్కౌంట్ల పేరుతో వచ్చే లింకులను నమ్మవద్దని, నమ్మకమైన అధికారిక వెబ్‌సైట్లు, యాప్‌ల ద్వారానే కొనుగోళ్లు చేయాలని సూచించారు. యూపీఐ ద్వారా డబ్బులు పొందడానికి క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాల్సిన అవసరం లేదని, డబ్బులు పంపే సమయంలో మాత్రమే సరైన వివరాలను నమోదు చేయాలని తెలిపారు. అదేవిధంగా తెలియని వ్యక్తులు పంపే లింకులను ఓపెన్ చేయవద్దని, అనవసరమైన యాప్‌లను డౌన్‌లోడ్ చేయవద్దని, వ్యక్తిగత ఫోటోలు, వీడియోలు, ఇతర వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలి. www.cybercrime.gov.in వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చు. ప్రజల భద్రతే లక్ష్యంగా జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నిరంతరం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రజలు అప్రమత్తంగా ఉంటూ సైబర్ నేరాల నివారణలో పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు. ప్రాణం సెంటర్ ను పరిశీలించి కాసేపు వయోవృద్ధులతో చెస్ క్యారం ఆడి వారిని ఉత్తేజపరిచారు. పోలీసు శాఖ తరపున ఎలాంటి సహాయ సహకారాలైన నిర్భయంగా జిల్లా పోలీసులను సంప్రదించవచ్చని పూర్తి సహాయ సహకారాలు అందిస్తారని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, వయోవృద్ధుల సంక్షేమ అధికారి మిల్కా, వయోవృద్ధుల సంఘం అధ్యక్షులు దేవిదాస్ దేశ్‌పాండే, సైబర్ క్రైమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటి గదిలో నిద్రిస్తున్న సమయంలో సెల్‌ఫోన్ల చోరీ



- చోరీ కేసును ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసిన ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీసులు

(ఆదిలాబాద్, సాక్షర): ఆదిలాబాద్ పట్టణంలోని నేతాజీ చౌక్, గాంధీ ప్రింటింగ్ ప్రెస్ సమీపంలో నివాసం ఉంటున్న హిందూ సింగ్ తన స్నేహితులతో కలిసి ఈ నెల 13వ తేదీ రాత్రి నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తి గదిలోకి ప్రవేశించి మూడు సెల్‌ఫోన్లను చోరీ చేశాడు.మరుసటి రోజు ఉదయం నిద్రలేచి చూడగా సెల్‌ఫోన్లు కనిపించకపోవడంతో బాధితుడు ఈ నెల 15వ తేదీన వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా చోరీకి పాల్పడిన బియ్యాల లక్ష్మణ్‌ను గుర్తించి అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి చోరీకి గురైన మూడు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.నిందితుడి వివరాలుబియ్యాల లక్ష్మణ్ (33), తండ్రి నర్సయ్య, మోచిగల్లి, ఆదిలాబాద్.ఈ సందర్భంగా వన్ టౌన్ ఎస్‌హెచ్‌ఓ బి. సునీల్ కుమార్ మాట్లాడుతూ, ప్రజలు తమ ఇళ్లలో నిద్రించే సమయంలో విలువైన వస్తువులు, సెల్‌ఫోన్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, దొంగతనాలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

మల్లారెడ్డి కబ్జాలపై మళ్లీ హైడ్రా – లెక్కుందా?



సాక్షర,హైదరాబాద్: హైదరాబాద్‌లోని చెరువుల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు లక్ష్యంగా ఏర్పడిన హైడ్రా బీఆర్ఎస్ మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి కుటుంబ సభ్యులపై మరోసారి విరుచుకుపడింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా జీడిమెట్ల పరిధిలోని ప్రసిద్ధ ఫాక్స్ సాగర్ ఎఫ్‌టీఎల్ , బఫర్ జోన్‌లను ఆక్రమించి నిర్మించిన గోడలను కూలగొట్టారు. మల్లారెడ్డి కుటుంబీకుల ఫామ్‌హౌస్ కాంపౌండ్ వాల్, ప్రవేశ ద్వారాలను హైడ్రా అధికారులు బుల్డోజర్లతో పూర్తిగా కూల్చివేశారుఫాక్స్ సాగర్ పునరుద్ధరణ ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి రికార్డులు, మ్యాప్‌లను పరిశీలించిన అధికారుల బృందం విస్తుపోయే నిజాలను బయటపెట్టింది. చెరువు ఎఫ్‌టీఎల్ స్థలంలో దాదాపు 15 ఎకరాల మేర మట్టిని అక్రమంగా నింపి, ఎత్తు పెంచి అర కిలోమీటరు మేర భారీ కట్ట నిర్మించుకున్నట్లు తేలింది. ఈ కట్టను ఆనుకుని ఫామ్‌హౌస్‌కు రక్షణగా ఎత్తైన కాంపౌండ్ వాల్, ఇనుప కంచెలను ఏర్పాటు చేశారు. భారీ పోలీసు భద్రత నడుమ రంగంలోకి దిగిన అధికారులు ఈ అక్రమ కట్టడాలను నిమిషాల వ్యవధిలో ధ్వంసం చేశారు.కూల్చివేతల సమయంలో మల్లారెడ్డి అనుచరులు, స్థానిక ప్రతినిధులు కొంతమంది అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ, హైడ్రా యంత్రాంగం వెనక్కి తగ్గలేదు. ప్రభుత్వం జారీ చేసిన శాటిలైట్ మ్యాప్‌లు, ఒరిజినల్ రెవెన్యూ రికార్డులను క్షేత్రస్థాయిలో చూపించి,చట్టప్రకారమే ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. ఎంతటి రాజకీయ హోదా ఉన్నవారైనా, మాజీ మంత్రులైనా సరే చెరువులను కబ్జా చేసి నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదని అధికారులు తేల్చిచెప్పారు.ఫాక్స్ సాగర్‌కు ఉన్న చారిత్రక ప్రాధాన్యాన్ని పునరుద్ధరించి, చెరువు పరివాహక ప్రాంతాన్ని ఆక్రమణదారుల నుంచి విముక్తి చేసే వరకు ఈ ప్రక్షాళన డ్రైవ్ కొనసాగుతుందని హైడ్రా అధికారులు ప్రకటించారు. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో మల్లారెడ్డికి చెందిన చాలా ఆస్తుల విషయంలో వివాదాలు వచ్చాయి. కొన్నింటినీ కూల్చివేశారు. అయితే తర్వాత వెనక్కి తగ్గారు. మళ్లీ ఇప్పుడు ఒక్కొక్కటిగా బయటకు తీస్తున్నారు.

బాసర ట్రిపుల్ ఐటీ పూర్వ విద్యార్థిని జక్కా శ్రావణికి ఘన సత్కారం

- డెలాయిట్ యూకేలో ఉన్నత స్థాయికి ఎదిగిన శ్రావణితో విద్యార్థుల ముఖాముఖి..
- 'ఆమె కథ' పుస్తకావిష్కరణ



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర): బాసర రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ)లో పూర్వ విద్యార్థిని జక్కా శ్రావణితో ప్రత్యేక ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు.విశ్వవిద్యాలయ అల్యూమ్ని, ఇంటర్నేషనల్ రిలేషన్స్ సెల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎ. గోవర్ధన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రావణి విజయ ప్రస్థానంపై రచయిత్రి రోజ రచించిన 'ఆమె కథ' పుస్తకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎ. గోవర్ధన్ మాట్లాడుతూ కష్టపడి చదువుకునే విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ ఒక గొప్ప వరమని పేర్కొన్నారు. నిరంతర కృషి, పట్టుదలతోనే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. బాసర విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ సంస్థల్లో ఉన్నత స్థానాల్లో కొనసాగడం గర్వకారణమని తెలిపారు. విద్యార్థులు పుస్తక పరిజ్ఞానంతో పాటు నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.అనంతరం జక్కా శ్రావణి తన విజయ ప్రయాణాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. బాసర ట్రిపుల్ ఐటీలో బీటెక్ పూర్తి చేసిన అనంతరం మూడేళ్లపాటు ఐబీఎం సంస్థలో పనిచేసినట్లు తెలిపారు. ఆ తర్వాత బ్రిటన్‌లోని డీ మోంట్‌ఫోర్ట్ విశ్వవిద్యాలయంలో మాస్టర్స్ పూర్తి చేసి, యూకేకు వెళ్లిన 40 రోజుల్లోనే మూడు ఉద్యోగావకాశాలు పొందినట్లు వెల్లడించారు. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయి సంస్థ డెలాయిట్ యూకేలో పనిచేస్తున్నట్లు వివరించారు. డిజిటల్ కంటెంట్ క్రియేటర్‌గా 7 లక్షలకు పైగా ఫాలోవర్లను సంపాదించడంతో పాటు విశ్వవిద్యాలయ అల్యూమ్ని అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ బాసర ట్రిపుల్ ఐటీలో చదువుకున్న రోజుల్లో ఎదురైన సమస్యలు, అనుభవాలు తనను ఎంతో ప్రభావితం చేశాయని పేర్కొన్నారు. తాను ఈ స్థాయికి చేరుకోవడానికి ట్రిపుల్ ఐటీ విద్యాభ్యాసమే పునాదిగా నిలిచిందన్నారు. మార్కులు మాత్రమే విజయానికి కొలమానం కాదని, కృతజ్ఞతా భావం, స్నేహపూర్వక వైఖరి, మంచి వ్యక్తులతో పరిచయాలు, నిరంతర అభ్యాసం జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి దోహదపడతాయని సూచించారు. ప్రస్తుత విద్యార్థులు క్యాంపస్‌లో అందుబాటులో ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని తమ లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ ఎస్. విఠల్, సీఓఈ డాక్టర్ జి. దేవరాజు, అల్యూమ్ని అఫైర్స్ ఫ్యాకల్టీ ఇన్‌చార్జ్ డాక్టర్ స్వప్నిల్, సీఎస్ఆర్ ఫండింగ్ ఫ్యాకల్టీ ఇన్‌చార్జ్ డాక్టర్ జి. శంకర్, డాక్టర్ ఎస్. శ్రావణ్, మండ సతీశ్, ఇతర అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దీపావళి భద్రతపై అవగాహన



సాక్షర,రామాయంపేట: మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలోని ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు దీపావళి పండుగ సందర్భంగా భద్రతా అవగాహన కార్యక్రమాన్ని అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు బాణసంచా కాల్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు ప్రమాదాలు జరిగినప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ అధికారి నరేష్ మాట్లాడుతూ దీపావళి పండుగను ఆనందోత్సాహాలతో పాటు సురక్షితంగా జరుపుకోవాలని తెలిపారు.బాణసంచా కాల్చే సమయంలో తప్పనిసరిగా భద్రతా నియమాలు పాటించాలని నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.విద్యార్థులు పెద్దల పర్యవేక్షణలోనే బాణసంచా కాల్చాలని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.పండుగ సమయంలో అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని భద్రతా నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు రెండు రోజుల అవగాహన - ఏరియా జిఎం ఎం.శ్రీ రమేష్



రెబ్బెన,సాక్షర:డిజిటల్ సర్టిఫికేట్ కాంపెయిన్ 5.0 కార్యక్రమంలో భాగంగా విశ్రాంత సింగరేణి ఉద్యోగులకు రెండు రోజుల పాటు గోలేటి జిఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో సిఎం పిఎఫ్,సిపిఆర్ఎంఎస్ రినివల్ చేసుకోవడం పై అవగాహన కల్పించనున్నట్లు ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీరమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఇప్పటివరకు విశ్రాంత ఉద్యోగులు పెన్షన్ రినివల్ కోసం జీవన్ ప్రమాన్,వైద్యసేవల కోసం హెల్త్ కార్డు రినివల్ ను మీ సేవా కేంద్రాల్లో మాత్రమే చేసుకుంటున్నారని,కాగా ఇప్పటినుండి మీసేవా కేంద్రాల్లో మాత్రమే కాకుండా ఇంట్లో తమ ఫోన్ లోనే రినివల్ చేసుకోవడం పై ఈ నెల16,17 తేదీలలో ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు సిఎంపిఎఫ్ పై సింగరేణి అధికారులు అవగాహన కల్పించనున్నారని తెలిపారు.విశ్రాంత సింగరేణి ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి ఏడాది ఇంటివద్దనే సిఎంపిఎఫ్,సిపిఆర్ఎంస్ రినివల్ చేసుకోవడం నేర్చుకోవాలని ఆయన కోరారు.అవగాహన కార్యక్రమానికి వచ్చే వారు ఆధార్,జీవన్ ప్రమాన్,సిపిఆర్ఎంఎస్ ప్రతులను తమ వెంట తీసుకువచ్చినచో రినివల్ చేస్తారని జిఎం తెలిపారు.

మ్యూల్ బ్యాంకు ఖాతాల వినియోగంపై ఉక్కుపాదం

- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
- ఆపరేషన్ క్రాక్‌డౌన్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక ఆపరేషన్



(ఆదిలాబాద్ ప్రతినిధి, సాక్షర): సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేసి సంపాదించిన డబ్బును ఒకరి నుంచి మరొకరి ఖాతాలకు బదిలీ చేసేందుకు మ్యూల్ బ్యాంకు ఖాతాలను వినియోగిస్తున్న నేపథ్యంలో, అటువంటి ఖాతాలను గుర్తించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ క్రాక్‌డౌన్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలిపారు.ఈ ప్రత్యేక ఆపరేషన్‌లో భాగంగా జిల్లాలో మొత్తం 51 అనుమానిత మ్యూల్ బ్యాంకు ఖాతాలను గుర్తించి, సంబంధిత బ్యాంకుల సమన్వయంతో విచారణ, క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టినట్లు వెల్లడించారు.సైబర్ నేరాలకు పాల్పడే వ్యక్తులకు తమ బ్యాంకు ఖాతాలను అందించడం, ఖాతాలను ఇతరుల ద్వారా నిర్వహించడం వంటి అంశాలపై సమగ్ర విచారణ నిర్వహించి, ఆధారాల మేరకు బాధ్యులపై ఇప్పటివరకు 9 కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు.

నిజామాబాద్ లో పారిశుద్ధ్యంపై కలెక్టర్ ఫోకస్

- పశువుల సంచారంపై కఠిన ఆదేశాలు



(నిజామాబాద్, సాక్షర):ఇంటింటికి తిరుగుతూ చెత్తను సేకరించే ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు.నాగారం శివారులోని డంపింగ్ యార్డును కలెక్టర్ బుధవారం సందర్శించారు. నగర పాలక సంస్థ పరిధిలో రోజువారీగా ఇంటింటికి తిరిగి సేకరించే చెత్తను డంపింగ్ యార్డు వద్ద నిలువ చేస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు.చెత్తను ఆయా విభాగాల వారీగా వేరు చేస్తూ, ఎరువులు, ఇతర అవసరాల వినియోగం కోసం యంత్రాల సహాయంతో శుద్ధి చేస్తున్న విధానాన్ని పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు సగటున ఎంత పరిమాణంలో చెత్తను శుద్ధి చేస్తున్నారు, ఎరువును ఎవరికి అందజేస్తున్నారు తదితర వివరాలను ఆరా తీశారు. ప్రతి రోజు సగటున 600 మెట్రిక్ టన్నుల చెత్తను బయో మైనింగ్ జరుపుతుండగా, దానిని వెయ్యి మెట్రిక్ టన్నులకు పెంచాలని కలెక్టర్ సూచించారు.డంపింగ్ యార్డు ప్రాంతంలో ఖాళీ స్థలాలను గుర్తించి విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, పచ్చదనం పెంపొందించాలని అన్నారు.డంపింగ్ యార్డు ప్రాంతం అంతా కవర్ అయ్యేలా సోలార్ ప్యానెల్స్ తో పని చేసే సీ.సీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, వ్యర్థాల శుద్ధి ప్రక్రియను నిశితంగా పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు.డంపింగ్ యార్డు ప్రదేశంలోని రోడ్డుకు ఆనుకుని ఇరువైపులా వ్యర్థాలను పోగు చేయకుండా దూరంగా తరలించాలని అన్నారు.

-రోడ్లపై పశువులను వదిలితే కేసులు నమోదు చేయండి..

రోడ్లపై ఎక్కడబడితే అక్కడ పశువులు సంచరించకుండా తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు.డంపింగ్ యార్డు ప్రాంతంతో పాటు నగరంలోని ప్రధాన రహదారులపై ఆవులు, ఇతర పశువులు ఎక్కడబడితే అక్కడ సంచరిస్తుండడం గమనించిన కలెక్టర్ అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. రోడ్లపై పశువుల సంచారం వల్ల వాహన చోదకులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని పశువులు రోడ్లపై సంచరించకుండా తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. రోడ్లపై పశువులను వదిలితే కేసులు నమోదు చేయాలని, జరిమానాలు విధించాలని ఆదేశించారు.కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఇతర అధికారులు ఉన్నారు.

పోటీ పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా సిద్ధమై లక్ష్యాన్ని సాధించాలి – కలెక్టర్ రాజర్షి షా



(ఉట్నూర్, సాక్షర): ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి మంద మకరందు, ఉట్నూర్ సబ్ కలెక్టర్ ప్రణయ్ నేడు ఉట్నూర్‌లోని యూత్ ట్రైనింగ్ సెంటర్ ను సందర్శించి, అక్కడ పీసీ & ఎస్ఐ ప్రిలిమినరీ పరీక్షలకు ఉచిత శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అభ్యర్థులతో మాట్లాడుతూ పోలీస్ కానిస్టేబుల్, సబ్ ఇన్‌స్పెక్టర్ పోటీ పరీక్షల పరీక్షా విధానం, ప్రశ్నపత్రం సరళి, సిలబస్, మార్కుల విభజన తదితర అంశాలను వివరించారు. పోటీ పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా ఎలా సిద్ధం కావాలి, సమయపాలన పాటిస్తూ రోజువారీ చదువును ఎలా కొనసాగించాలి, గత ప్రశ్నపత్రాలను ఎలా సాధన చేయాలి అనే అంశాలపై విలువైన సూచనలు చేశారు.అభ్యర్థులు క్రమశిక్షణతో, పట్టుదలతో చదివి లక్ష్యాన్ని సాధించాలని, అందుబాటులో ఉన్న శిక్షణా వనరులను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ ఉద్యోగాలను సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు.అనంతరం శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు కలెక్టర్, ప్రాజెక్టు అధికారి, సబ్ కలెక్టర్ చేతుల మీదుగా నోట్‌బుక్స్ మరియు పెన్నులను పంపిణీ చేశారు. అభ్యర్థులు వాటిని సద్వినియోగం చేసుకొని చదువులో మరింత శ్రద్ధ చూపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జాబ్స్ డిస్ట్రిక్ట్ మేనేజర్ జేడీఎం, నాగభూషణం, వైటీసీ సిబ్బంది, రీజనింగ్ ఫ్యాకల్టీ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసిన టీజేఎస్ రాష్ట్ర కమిటీ



సాక్షర,హుజురాబాద్: తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ కోదండరాం నాయకత్వంలో టీజేఎస్ రాష్ట్ర కమిటీ మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న పలు సమస్యలతో పాటు స్థానిక సమస్యలను చర్చించినట్లు తెలంగాణ జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ముక్కెర రాజు తెలిపారు.

ఎల్నినో కారణంగా ఇబ్బంది పడుతున్న రైతులను ఆదుకోవాలని, విద్యార్థులకు రావాల్సిన ఫీజ్ రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని, ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, తెలంగాణ ఉద్యమకారుల కోసం తగిన సహాయక చర్యలను తీసుకోవాలని పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణాన్ని పూర్తి చేయాలని, ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని, వారు ముఖ్యమంత్రిని కోరగా దానికి సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ముక్కెర రాజు తెలిపారు.

పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలి

(బెల్లంపల్లి, సాక్షర): తీన్మార్ మల్లన్న నాయకత్వంలో రాజ్యాధికార సాధనే పార్టీ లక్ష్యమని జిల్లా అధ్యక్షులు మహేష్ వర్మ అన్నారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ విస్తృతస్థాయి సమావేశాన్ని వాసాల అనిల్, సత్రవేణి వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మంచిర్యాల జిల్లా అధ్యక్షులు మహేష్ వర్మ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహేష్ వర్మ మాట్లాడుతూ.. తెలంగాణ రాజ్యాధికార పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతతో పనిచేయాలని సూచించారు. పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు నూతన కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువ కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రధానంగా పార్టీ భవిష్యత్తు కార్యాచరణ, జిల్లా కమిటీ బలోపేతం, నూతన బాధ్యతలు చేపట్టిన నాయకులకు నియామక పత్రాల అందజేత వంటి అంశాలపై చర్చించారు.అలాగే రాబోయే రాజ్యాధికార పాదయాత్రను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను గుర్తించి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు.బెల్లంపల్లి నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల్లో పార్టీ కమిటీలను ఏర్పాటు చేసి పార్టీ నిర్మాణాన్ని క్షేత్రస్థాయి నుంచి పటిష్టం చేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ ప్రజల గొంతుకగా పార్టీ నిలవాలని పేర్కొన్నారు.తీన్మార్ మల్లన్న నాయకత్వంలో బహుజనులకు రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, రాజ్యాధికార సాధన లక్ష్యంగా పార్టీ ముందుకు సాగుతుందని మహేష్ వర్మ స్పష్టం చేశారు. సమావేశంలో బెల్లంపల్లి నియోజకవర్గ నాయకులు, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రెండున్నరేళ్లుగా విధులకు దూరంగా ఉపాధ్యాయుడు!

- వెంకటాపూర్ పాఠశాలకు వెంటనే మరో టీచర్‌ను కేటాయించాలి
- నిర్లక్ష్యం వీడకపోతే డీఈఓ కార్యాలయాన్ని ముట్టడిస్తాం
- ఎస్ ఎఫ్ ఐ ఏఐపిఎస్ యు నాయకులు



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై, పర్యవేక్షించాల్సిన బాధ్యత విద్యాశాఖ అధికారులపై ఉందని, అయితే కొందరి నిర్లక్ష్యం కారణంగా గ్రామీణ విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని ఎస్ఎఫ్ఐ ఏఐపిఎస్ యు విద్యార్థి సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.ముధోల్ మండలం వెంకటాపూర్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించాల్సిన ఇద్దరు ఉపాధ్యాయుల్లో ఒకరు గత రెండున్నర సంవత్సరాలుగా విధులకు హాజరుకావడం లేదని వారు ఆరోపించారు.ఈ కారణంగా విద్యార్థులకు పూర్తిస్థాయిలో విద్యాబోధన అందడం లేదని పేర్కొన్నారు. సదరు ఉపాధ్యాయుడి గైర్హాజరుపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవడంతో పాటు, పాఠశాలకు వెంటనే ప్రత్యామ్నాయ ఉపాధ్యాయుడిని కేటాయించాలని డిమాండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ)కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి దిగంబర్, ఏ ఐ పీ ఎస్ యు నిర్మల్ జిల్లా కార్యదర్శి గడపాలి పరమేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగంలో ఉంటూ విధుల పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. రెండున్నరేళ్లుగా ఉపాధ్యాయుడు విధులకు దూరంగా ఉన్నప్పటికీ విద్యాశాఖ అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. ఈ విషయంపై స్థానిక మండల విద్యాశాఖ అధికారిని వివరణ కోరగా, సదరు ఉపాధ్యాయుడికి జీతం రావడం లేదని, ఆయన సెలవులో ఉన్నారని సమాధానం ఇచ్చారని తెలిపారు. అయితే ఉపాధ్యాయుడికి జీతం వస్తుందా లేదా అన్నది పక్కన పెడితే, రెండేళ్లకు పైగా విద్యార్థులకు బోధన అందకపోవడంపై అధికారులు ఎందుకు దృష్టి సారించడం లేదని ప్రశ్నించారు.రెండున్నరేళ్లుగా విధులకు హాజరుకావడం లేదని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయుడిపై సమగ్ర శాఖాపరమైన విచారణ జరిపి, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి.వెంకటాపూర్ ప్రాథమిక పాఠశాలకు తక్షణమే ప్రత్యామ్నాయ ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్‌పై కేటాయించి విద్యాబోధనకు ఆటంకం లేకుండా చూడాలి. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని వారు కోరారు. సమస్యను పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహిస్తే ఎస్ ఎఫ్ ఐ ఏఐపిఎస్ యు ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఇరు విద్యార్థి సంఘాల నాయకులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కుమురం భీమ్ వర్ధంతి వారోత్సవాల ముగింపు కార్యక్రమం



సాక్షర,ఆసిఫాబాద్: గిరిజన హక్కుల కోసం పోరాడి జల్, జంగల్, జమీన్ నినాదంతో ఆదివాసీల ఆత్మగౌరవ పోరాటానికి స్ఫూర్తిగా నిలిచిన గిరిజన పోరాట యోధుడు అమరుడు కొమురం భీమ్ వర్ధంతి వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని బుధవారం కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కుమురం భీమ్ చౌక్‌లో ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ కొమురం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, వారోత్సవాల ముగింపు సందర్భంగా జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అమరుడు కొమురం భీమ్ చేసిన పోరాటాలను, ఆదివాసీల హక్కుల సాధన కోసం ఆయన చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. గిరిజన సమాజం ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణ కోసం కొమురం భీమ్ చేసిన పోరాటం నేటి తరానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.కొమురం భీమ్ ఆశయాలను భావితరాలకు తెలియజేస్తూ, ఆయన చూపిన మార్గంలో ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆదివాసీ సంఘాల నాయకులు, ఆత్రం సక్కు మాజీ శాసన సభ్యులు, ఆత్రం సుగుణ డి సి సి అధ్యక్షులు, సిడాం అర్జు, మాడావి శ్రీనివాస్, పెందూర్ సుధాకర్,ఆత్రం చందన్ సావ్ ,కుమరం సీతారామ్, కుమరం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భైంసా గ్రీవెన్స్ డేలో ప్రజల ఫిర్యాదులనుత్వరగా పరిష్కరించాలి

(నిర్మల్ ప్రతినిధి/ భైంసా, సాక్షర) : ప్రజల ఫిర్యాదులనుత్వరగా పరిష్కరించాలని ఎస్పీ డా. జి. జానకి షర్మిల అన్నారు.జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, గురువారం భైంసా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.భైంసా సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదుపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, చట్టప్రకారం చర్యలు తీసుకొని సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.కుటుంబ సమస్యలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులపై షీ



టీం సిబ్బంది ఇరు వర్గాలతో మాట్లాడి కౌన్సిలింగ్ నిర్వహించారు. సమస్యలను పరస్పర అవగాహనతో పరిష్కరించుకునేలా సూచనలు చేశారు.అదేవిధంగా గతంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలలో వచ్చిన ఫిర్యాదుల్లో ఇంకా పరిష్కారం కానివాటిపై ఎస్పీ సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను ఆలస్యం చేయకుండా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు గ్రీవెన్స్ డే మంచి అవకాశమని, ఈ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ తెలిపారు.

Printed, Published, Edited and Owned by A. Linganna, Printed at EVR Printers, Vidyanagar, Adilabad - 504001. Telangana.
Published at D.No. 5-91/2, Talamadugu (Vill & Mandal) Adilabad - 504312. A.P. RNI No. APTEL/2011/42149. Editor A. Linganna.
Phone: 08732-231345. Email: Saaksharaadb@gmail.com